AKHANDAA SURYAA

# అఖండ సూర్య

PRGI NO : TGTEL/25/A1809

అజేయ ప్రజా స్వరం

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Hyderabad and Vijayawada

E-Paper:https://epaper.akhandasurya.com

సంపుటి : 01 సంచిక : 270 హైదరాబాద్, ఏప్రిల్, బుధవారం 22, 2026 పేజీలు : 12 వెల : 6.00

## దక్షిణాదిపై వివక్ష

డీలిమిటేషన్

ప్రజాస్వామ్యంపై దాడి

తమిళనాట కేజ్రీవాల్ గర్జన!

తమిళనాడులో డీఎంకే

తరపున ఎన్నికల ప్రచారం

నిర్వహించిన కేజ్రీవాల్

జనాభా నియంత్రణ పాటించిన

దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా

డీలిమిటేషన్ బిల్లు ఉందన్న కేజ్రీ

విపక్షాలన్నీ ఈ బిల్లును

వ్యతిరేకిస్తున్నాయని వెల్లడి



**అఖండసూర్య, హైదరాబాద్**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగుస్తున్న తరుణంలో, డీఎంకే కూటమికి మద్దతుగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం చూపుతున్న వివక్షను ఆయన ఎండగట్టారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కేజ్రీవాల్ 'ప్రజాస్వామ్యంపై దాడి'గా అభివర్ణించారు. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా ఈ బిల్లు ఉందని, అందుకే తాము దీన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో విపక్షాలన్నీ ఏకతాటిపై ఉన్నాయని స్పష్టం చేశారు. సీఎం స్టాలిన్ తమిళనాడులో అద్భుతమైన పాలన అందిస్తున్నారని, మంచి చేసే వారికి



# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

### మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు

అధికారులతో సమీక్షలో కీలక సూచనలు చేసిన మంత్రి

యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పెంచాలని ఆదేశాలు

అన్ని కొనుగోలు కేంద్రాలకు లారీలు

అందుబాటులో ఉంచాలని సూచన

రాత్రింబవళ్లు ధాన్యం సేకరణ చేపట్టాలని ఆర్డర్

ధాన్యం ఎక్కువగా వచ్చే

గ్రామాలకు అదనపు వాహనాల పంపిణీ

రోడ్లపై ధాన్యం పోకుండా ప్రత్యామ్నాయ కేంద్రాల ఏర్పాటు

కొత్త రేషన్ కార్డులతో కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ

గత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన మంత్రి

ధాన్యం నిల్వల్లో భారీ కుంభకోణం జరిగిందన్న ఆరోపణ

నల్గొండ జిల్లాలో కేసులు నమోదు చేసినట్లు వెల్లడి

**అఖండసూర్య, హైదరాబాద్**

రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు పరిస్థితులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లు యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని పేర్కొన్నారు. ఎక్కడా ఆలస్యం లేకుండా, వేగంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు తమ పంటను అమ్ముకునేందుకు ఎక్కువ రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. ధాన్యం సేకరణలో లాజిస్టిక్స్ కీలకమని మంత్రి వివరించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి అవసరమైనన్ని లారీలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వాహనాల కొరత కారణంగా ధాన్యం నిల్వలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాత్రి, పగలు తేడా లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిల్వలు పేరుకుపోవడం వల్ల నష్టాలు కలగకుండా ఉండాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి చెప్పారు. అలాంటి ప్రాంతాలకు అదనపు లారీలు పంపించి, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చిన ధాన్యం నిల్వలు ఎక్కువ కాలం ఉండకుండా తక్షణం తరలించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై ధాన్యం పోసి ఉంచుతున్న పరిస్థితులపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను నివారించేందుకు స్కూళ్లు, ఫంక్షన్ హాళ్లు

# ఆర్టీసీ సమ్మెకు రంగం సిద్ధం

నేటి నుంచి సమ్మెకు పిలుపునిచ్చిన ఆర్టీసీ జేఏసీ

అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాల మద్దతు ఉందన్న జేఏసీ

41 రోజులు గడిచినా చర్చలు జరపలేదని ప్రభుత్వంపై విమర్శ

విలీన ప్రక్రియలో ఆలస్యం జరుగుతోందన్న ఆరోపణలు

కాలయాపన కోసమే విలీన కమిటీ అన్న జేఏసీ నేతలు

మెట్రోకు ప్రాధాన్యం.. ఆర్టీసీ నిర్లక్ష్యమన్న విమర్శ

ఆస్తులను ప్రైవేట్ పరం చేయాలనే ప్రయత్నాలపై ఆందోళన

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కూడా సమ్మెలో పాల్గొనాలని పిలుపు

ఆర్టీసీ భూముల వినియోగంపై సందేహాలు వ్యక్తం

సమ్మె సకల జనుల సమ్మెగా మారే అవకాశం ఉందన్న హెచ్చరిక

**అఖండసూర్య, హైదరాబాద్**

రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న సమ్మెపై ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న కీలక వ్యాఖ్యలు చేశారు. సమ్మెకు ఇప్పటికే అన్ని ఆర్టీసీ సంఘాలు, పలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయని ఆయన తెలిపారు. సమ్మె విజయవంతం చేసేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులు గడిచినా ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం బాధాకరమని వెంకన్న అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్చలు జరపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ తమ ఆందోళనలను వెల్లడించారు. సమ్మెకు ముందు ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనడం సాధ్యమని, లేకపోతే సమ్మె తప్పదని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియలో ఆలస్యం జరుగుతోందని జేఏసీ నేతలు ఆరోపించారు. విలీనంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ అంశంపై ఏర్పాటుచేసిన కమిటీ కూడా కేవలం సమయాన్ని వృథా చేయడానికే ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. మెట్రో రైలుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, కానీ



# రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు

### కాళేశ్వరం ప్రాజెక్టు కాంగ్రెస్, బీజేపీలకు ఏటీఎం
### అవినీతి వ్యవహారంపై బండి సంజయ్ ప్రశ్నల వర్షం

రేవంత్ మెతక వైఖరి

అవలంభిస్తున్నారు

కేసీఆర్ కుటుంబంపై

చర్యలు ఎందుకు తీసుకోరు

రేవంత్ రాసిన లేఖల

అసలు ఉద్దేశ్యంపై

సందేహాలు

మహిళా రిజర్వేషన్ బిల్లును

కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నది

కేంద్రమంత్రి బండి

సంజయ్ విమర్శలు



**అఖండసూర్య, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలపై విస్తృతంగా స్పందించిన ఆయన, ఇద్దరు నేతల భాష, విధానాలను తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్‌రెడ్డిని 'రాహువు', కేసీఆర్‌ను 'కేతువు'గా వ్యాఖ్యానిస్తూ రాజకీయంగా ఇద్దరూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ మాట్లాడే తీరు ప్రజల్లో చర్చకు దారితీస్తోందని వ్యాఖ్యానించారు. మాటలకే పరిమితమై ప్రజా సమస్యలపై గంభీరత కనబరచడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఒక విధంగా మాట్లాడిన ఆయన,

# విభజనపై విషం చిమ్మొద్దు

### చంద్రబాబుకు మంత్రి పొన్నం బహిరంగ లేఖ
### బీజేపీ, టీడీపీ, జనసేన నేతల వ్యాఖ్యలపై అభ్యంతరం
### విభజనను తప్పుగా చిత్రీకరించడం సరికాదన్న మంత్రి

విద్వేషాలు రెచ్చగొట్టేలా

వ్యాఖ్యలు ఉన్నాయని ఆందోళన

ఎంపీ తేజస్వి వ్యాఖ్యలపై

స్పీకర్‌కు లేఖ రాయాలని విజ్ఞప్తి

లోక్‌సభ రికార్డుల నుంచి

వ్యాఖ్యలు తొలగించాలన్న డిమాండ్

రెండు రాష్ట్రాలు కలిసి అభివృద్ధి

దిశగా నడవాలన్న పిలుపు

నాయకులు బాధ్యతాయుతంగా

మాట్లాడాలని సూచన

సమస్యపై తగిన చర్యలు

తీసుకుంటారని ఆశాభావం



**అఖండసూర్య, హైదరాబాద్**

రాష్ట్ర విభజన అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం ఎవరికీ మేలు చేయదని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బహిరంగ లేఖ రాసి తన ఆందోళనలను వెల్లడించారు. ఇటీవల కొన్ని రాజకీయ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య అపోహలు, విద్వేషాలు పెంచేలా ఉన్నాయని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ తన లేఖలో ముఖ్యంగా భాజపా, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల నేతల వ్యాఖ్యలను ప్రస్తావించారు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగిందని, అది ప్రజలపై అన్యాయం చేసిందని చెప్పే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విధమైన వ్యాఖ్యలు

# ఆధార్ అప్‌డేట్‌కు గడువు పొడిగింపు

ఆధార్ అప్‌డేట్‌కు కేంద్రం గుడ్ న్యూస్

జూన్ 14 వరకు ఉచితంగా

వివరాల సవరణకు అవకాశం

భారత విశిష్ట గుర్తింపు

ప్రాధికార సంస్థ ప్రకటన

జూన్ 15 నుంచి అప్‌డేట్‌లకు

రుసుము తప్పనిసరి

ప్రభుత్వ పథకాల లబ్ధికి ఆధార్ కీలక పత్రం

బ్యాంక్ కేవైసీకి ఆధార్ అప్‌డేట్ అవసరం

పదేళ్లుగా అప్‌డేట్ చేయని

వారు తప్పనిసరిగా సవరణ చేయాలి

లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా

నగదు బదిలీలలో ఆధార్ ప్రాధాన్యం

తప్పులు లేకుండా వివరాలు

సరిచేయాలని సూచనలు

ఆలస్యం చేస్తే సేవల్లో ఇబ్బందులు

ఎదురయ్యే అవకాశం




**అఖండసూర్య, హైదరాబాద్**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆధార్ కార్డు అత్యంత ముఖ్యమైన గుర్తింపు పత్రంగా మారింది. వ్యక్తిగత గుర్తింపుతో పాటు అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సేవల్లో ఇది తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో ఆధార్ వివరాలను సకాలంలో అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పలు మార్లు సూచిస్తోంది. తాజాగా ఈ ప్రక్రియను సులభతరం చేస్తూ కేంద్రం ప్రజలకు గుడ్ న్యూస్ తెలిపింది. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) ఆధార్ అప్‌డేట్ గడువును ఈ ఏడాది జూన్ 14 వరకు పొడిగించినట్లు ప్రకటించింది. ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకోలేని వారికి ఇది ఒక మంచి అవకాశం



## ఎగువ అహోబిలంలో అత్యంత వైభవంగా
# ధ్వజా రోహణం కార్యక్రమం

**అఖండ సూర్య, ఆళ్లగడ్డ ప్రతినిధి**

ఎగువ అహోబిలం క్షేత్రంలో శ్రీ నరసింహ స్వామి వారి జయంతి బ్రహ్మోత్సవాలలో భాగంగామంగళ వారం ఉదయం ఆలయ ముద్ర కర్త వేణుగోపాల్ ఆధ్వర్యములో ఆలయ అర్చక స్వాములు గరుడ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజ స్తంభము పై ఎగుర వేస్తూ, అష్ట అధిక్పా లకులును, 33 కోట్ల బ్రహ్మాది దేవతలను ఎగువ అహోబిలం క్షేత్రంలో 11 రోజుల పాటు జరిగే శ్రీ నృసింహ వారి జయంతి బ్రహ్మోత్సవాలకు ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా ఆహ్వానించారు. అనంతరం బేరీ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ జ్వాలా నరసింహ స్వామి ,అమ్మ వార్లకు వేద మంత్రోచ్ఛరణల మధ్య భక్తుల హరినామ సంస్కరణల మధ్య ఆలయ అరాచక స్వాములు అభిషేకం చేశారు. రాత్రి సింహ్మ వాహనం పై శ్రీ జ్వాలా నరసింహ స్వామి తిరు వీధుల్లో ఊరేగుత బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు దర్శన భాగ్యంకలిగించారు. ఈ ఉత్సవంలోముద్రకర్త కిడాంబి వేణుగోపాలన్, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ పార్థసారథి , మణియార్ సౌమ్యనారాయణన్ అర్చకులు కల్యాణ రంగన్,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి వెళ్లడం తప్పా?

రేవంత్ కుట్రలు అడ్డుకొనేందుకే వెళ్లాను

నేను బాజాప్తా ఢిల్లీకి పోయిన.. సీక్రెట్ ఏమీ లేదు

సీనియర్ లాయర్లతో సమావేశాలపై స్పష్టీకరణ

కాళేశ్వరం కేసులపై

న్యాయపరమైన చర్చలు జరిపాను

ఓటుకు నోటు కేసు విచారణపై కీలక వ్యాఖ్యలు

సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఆరోపణలు

మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు



**అఖండసూర్య, హైదరాబాద్**

బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే తాను దిల్లీ పర్యటనకు వెళ్లినట్లు మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన కేసులు, ఓటుకు నోటు కేసు వంటి కీలక అంశాలపై సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు విస్తృతంగా మాట్లాడారు. దిల్లీ పర్యటన ఉద్దేశ్యంపై వస్తున్న విమర్శలకు సమాధానంగా హరీశ్‌రావు స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు ముందస్తుగా న్యాయపరమైన సలహాలు తీసుకోవడం అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలోనే దేశంలో పేరున్న న్యాయవాదులతో సమావేశమయ్యామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నమోదవుతున్న కేసుల విషయంలో సుదీర్ఘ చర్చలు జరిగినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను న్యాయపరంగా ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలపై చర్చించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న విమర్శలు రాజకీయ ప్రేరేపితమని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటుకు నోటు కేసుపై కూడా హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు త్వరలో సుప్రీంకోర్టులో విచారణకు రానుందని పేర్కొన్నారు. ఆ విచారణ నేపథ్యంలోనే న్యాయవాదులతో సమావేశమై కేసు వివరాలపై చర్చించామని తెలిపారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును ఎలా ముందుకు తీసుకెళ్తుందన్న దానిపై అనుమానాలు వ్యక్తం చేశారు. హోంశాఖ తరఫున అనామక న్యాయవాదిని నియమించడం సరైన విధానం కాదని విమర్శించారు.ఇక నిందితుల తరఫున





## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**అఖండ సూర్య సంగారెడ్డి**

ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (DRDO) ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి స్థానిక మహిళా శక్తి పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పెట్రోల్ బంక్‌లో అందిస్తున్న సేవలను, నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉన్న టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అవి ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా, పెట్రోల్ బంక్‌కు సంబంధించిన రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల వివరాలు తదితర పుస్తకాలను పరిశీలించి, అన్ని వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. పెట్రోల్ బంక్ లావాదేవీలను సమగ్రంగా పరిశీలించి, పూర్తి స్థాయి రీకన్సిలియేషన్ (Reconciliation) త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా పరిశుభ్రత, పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ చాలా కీలకమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి సంస్థపై ఉందని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.




## సంగారెడ్డి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**అఖండ సూర్య సంగారెడ్డి /**

సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ గారి జన్మదిన వేడుకలు సంగారెడ్డిలో ఘనంగా జరిగాయి. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో బీ ఆర్ఎస్వి నాయకులు అఖిల్ పాల్గొని ఎమ్మెల్యే గారిని కలిసి శాలువాతో సన్మానించి, మెమొంటోను అందజేసి, ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు , కార్యదర్శి నర్సింలు యువత తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం నవ నిర్మాణంలో చెరువుల పునరుద్ధరణ

- ఎమ్మెల్యే ఎం ఎస్. రాజ్ ఠాకూర్

**అఖండ సూర్య గోదావరిఖని**

రామగుండం నవనిర్మాణంలో భాగంగా చెరువుల పునరుద్ధరణ చేపడుతు న్నామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. అమృత్ 2.0 నిధులు రూ. 2.53 కోట్లతో రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రశాంత్ నగర్ మల్లపు రాణి కుంట,రూ 1.81 కోట్లతో మల్కాపూర్ బామండ్ల కుంట చెరువుల పునరుజ్జీవన పనులను నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి మంగళ వారం ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పునరుజ్జీవన పనుల్లో భాగంగా చెరువుల సుందరీకరణతో పాటు స్థానికులకు ఆహ్లాదాన్ని అందించడానికి ఈ రెండు చెరువుల వద్ద గార్డెన్ , వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మల్కాపూర్ , ప్రశాంత్ నగర్ లలోని లోతట్టు ప్రాంతాలు గతంలో వరద ముంపుకు గురై స్థానికులు అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నారని గుర్తు చేసుకున్నారు. మరోసారి వరద ముప్పు ఏర్పడకుండా కాలువల నిర్మాణంతో కాలువల్లో పూడిక తీత పనులు చురుగ్గా నిర్వహించడం జరుగుతు న్నదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులతో పాటు పేదలు ,మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. రామగుండం నగరాన్ని వ్యాపార , విద్యా , వైద్య కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా ఉపాధి కల్పనా కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ చెరువుల పునరుజ్జీవన పనులతో పాటు మూడవ డివిజన్ కార్పొరేటర్ వడ్లూరి రవి అభ్యర్థన మేరకు మరో కోటి రూపాయల పనులను ఎం ఎల్ ఎ మంజూరు చేశారని అన్నారు. మే నెల రెండవ వారంలో ఈ నిధులతో మూడవ డివిజన్ లో రోడ్లు , కాలువలు నిర్మాణం ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్లు వడ్లూరి రవి , వెంగళ బాపు , చిదురాల నాగరాజు , కొలని కవిత ,ధూళికట్ట సతీష్ ,పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం డి. ఇ.నర్సింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ కూలర్స్ వితరణ

**అఖండ సూర్య సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎస్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షురాలు అశ్విత రెడ్డి చిన్నమైల్ అధ్యక్షతన వాటర్ కూలర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షురాలు అశ్విత రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు అవసరాలను గుర్తించి ఇలాంటి మరిన్ని సేవ కార్యక్రమాలను ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని చేస్తామన్నారు. కార్యాలయంలో ఎస్ ఆర్ ట్రస్ట్ ద్వారా వాటర్ కూలర్ ఏర్పాటు చేసినందుకు సబ్ రిజిస్ట్రార్ సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు. వివిధ అవసరాలకు ఆఫీస్ కు రైతులు, మహిళాలు వస్తారని, వారి సౌకర్యార్థం వాటర్ కూలర్ అందించడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ అజ్మద్, శేఖర్, ట్రస్టు సభ్యులు చిలుక రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

- సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం లో కార్యకర్తలకు, నాయకులకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపు
- మహిళా బిల్లు విషయంలో బీజేపీ చేసిన కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- డిసిసి అధ్యక్షురాలు, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**అఖండ సూర్య సంగారెడ్డి /**



సంగారెడ్డి పట్టణం లోని ఓ ప్రైవేట్ హోటల్ లో మంగళవారం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యం లో జరిగిన ఈ సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి తో పాటు జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ , మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు, పఠాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం , పార్టీ కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తేనే విజయం సాధిస్తామని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచామని, మున్సిపల్ ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. అయినప్పటికీ జిల్లాలో ఇంకా నాయకుల మధ్య సమన్వయం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాల ను చేపట్టినా, ఆ సందేశాన్ని, స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్ళా ల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తల పైనే ఉంటుందన్నారు. కార్యకర్తల కు సముచిత స్థానం ఇవ్వాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుండే సన్నద్ధం కావాలి, పార్టీ నాయకుల మధ్య వర్గ పోరు ఉండొద్ద న్నారు. నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండటం సహజమే.. కానీ వర్గ పోరు వల్ల పార్టీ కి నష్టం జరుగుతుందన్నారు. డెబ్బై వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఇప్పటివరకు కేవలం ఆరోగ్య శాఖ లోనే దాదాపు ఇరవై వేల ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు.లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలు ను రైతు బంధు రూపం లో రైతులకు అందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని గ్రామగ్రామాన విజయవంతంగా అమలవుతోందన్నారు . నలబై ఆరు లక్షల మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టామని, దేశం లో ఎక్కడా లేనివిధంగా డిజిటల్ హెల్త్ కార్డ్ లు అందించేందుకు కృషి చేస్తున్నా మని తెలిపారు. జహీరాబాద్, నారాయణ్ ఖేడ్ ఆసుపత్రులలో మరో 50 పడకలు అదనంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి మెడికల్ కళాశాల లో భవిష్యత్తు లో పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. సింగూరు ప్రాజెక్టు ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. 200 కోట్లతో సింగూరు ప్రాజెక్టు ను టూరిజం స్పాట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వం ముందుకెళ్తోంది అని అన్నారు. మహిళా బిల్లు కు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సెపరేట్ గా బిల్లు పెడితే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. డీలిమిటేషన్ ఉన్నా లేకున్నా మరోసారి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా గెలిచాం, మన బలాబలాలు , లోపాల పై చర్చించుకోవాలి అన్నారు. వచ్చే ఎంపీ టీ సి , జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయం లో చర్చ జరగాలన్నారు. మూడేళ్ల కు పైగా మండలస్థాయి లో పనిచేసిన వారికి, జిల్లా స్థాయి లో పదవులు ఇచ్చి, వారి స్థానం లో మండలం లో కొత్తవారిని నియమించాలని సూచించారు. ప్రభుత్వం ఉన్నది కాబట్టి అభ్యర్థుల ఎంపిక లో పోటీ ఉందని, మన మధ్యే మనకే పోటీ వల్ల పార్టీ కి నష్ట జరుగుతుందన్నారు.మొన్న పార్లమెంట్ లో జరిగిన పరిణామాల ను, ఎందుకు మహిళా బిల్లు ను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందో , మహిళా బిల్లు విషయం లో బీజేపీ కుట్ర లను సైతం పార్టీ పరంగా చర్చ జరగాలి, ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ మాట్లాడుతూ మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 70% మంది సర్పంచ్ లు గా గెలిచారన్నారు. నాయకుల మధ్య సమన్వయం ఉం డాలి, అన్ని నియోజకవర్గాల్లో సమన్వయం తో పని చేయా లని పిలుపునిచ్చారు. దేశం లో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రం లో సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, సన్న బియ్యం, ఇందిరమ్మ గృహ పథకాల పట్ల ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం రైతు బంధు ను కొనసాగిస్తుంది అని వివరించారు. రాష్ట్రం లో ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసే విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టబోతుందన్నారు.వచ్చే ఎన్నికల్లో నూ కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని తెలిపారు. నీలం మధు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రం లో జరిగిన కుల గణన ఆధారంగా వచ్చే ఎన్నికల్లో అన్ని కులాల కు సమ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్పర్సన్ సునీతా పాటిల్, పిసిసి ప్రధాన కార్యదర్శులు తోపాజి అనంత్ కిషన్, చిన్నా ముదిరాజ్, నాయకులు శశికళా యాదవ్ రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారయణ, కొహీర్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





## హట్టహాసంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు

**అఖండ సూర్య సంగారెడ్డి**

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా, హట్టహాసంగా నిర్వహించబడ్డాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద పండుగ వాతావరణాన్ని తలపించింది. పట్టణం అంతటా ఎమ్మెల్యే ఫ్లెక్సీలు, బ్యానర్లు అలంకరించగా, కార్యకర్తలు, అభిమానుల సందడి నెలకొంది. మండలాల వారీగా వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రేన్లతో గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఎమ్మెల్యే గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిఆర్ఎస్ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణం 13వ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సేవా భావాన్ని చాటుకున్నారు. ప్రత్యక్షంగా మరియు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## ప్రజా సమస్యలపై పోరాటం

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు

**అఖండ సూర్య సంగారెడ్డి /**

జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు గారు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ను కలిసి పలు సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ... జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో 2020లో మంజూరైన 8 వెంటిలేటర్లు ఇప్పటికీ సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత కారణంగా పనిచేయకుండా ఉండటం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. సెంట్రల్ ఆక్సిజన్ సరఫరా సక్రమంగా లేకపోవడం, నిపుణులైన టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వెంటిలేటర్లను తక్షణమే పని చేసే స్థితికి తీసుకురావాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో డయాలిసిస్ సేవలపై తీవ్ర ఒత్తిడి ఉందని వెల్లడించారు. ప్రస్తుతం 10 డయాలిసిస్ యంత్రాలు మాత్రమే ఉండగా, రోజుకు సుమారు 40 మంది రోగులు వేచి ఉండాల్సి వస్తోందని చెప్పారు. నెలకు సుమారు 900 సెషన్లు నిర్వహిస్తున్నప్పటికీ అవసరాలకు సరిపోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో జహీరాబాద్ ఆసుపత్రికి అదనంగా 6 డయాలిసిస్ యంత్రాలు, సిబ్బంది మంజూరు చేయాలని, అలాగే కోహీర్ ఆసుపత్రికి 5 డయాలిసిస్ యంత్రాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. దీనివల్ల రోగులపై ఉన్న ఒత్తిడి తగ్గి, సేవలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి స్పందించినట్లు ఎమ్మెల్యే మాణిక్ రావు తెలిపారు.

## పర్యావరణ సంరక్షణే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ ప్రావిణ్య
- అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరణ

**అఖండ సూర్య సంగారెడ్డి**




అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని, "99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కలెక్ట్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. "భూమిని కాపాడుకుందాం", "ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం", "పచ్చదనం పెంచుదాం" వంటి నినాదాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.అలాగే, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను సంరక్షించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని, పర్యావరణ హిత చర్యలను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, NGC జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, SGF సెక్రటరీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య

**అఖండ సూర్య సంగారెడ్డి/**



సంగారెడ్డి జిల్లా హత్నూర గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహ చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించ బడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, పిల్లల హక్కులు, భద్రత కోసం ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి గ్రామాలను బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. పాక్సో చట్టం (POCSO Act) ద్వారా బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠిన శిక్షలు అమలు అవుతున్నాయని వివరించారు. అలాగే డొమెస్టిక్ వైలెన్స్ చట్టం ద్వారా కుటుంబంలో మహిళలు ఎదుర్కొనే హింసకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులు, ఆన్లైన్ మోసాల పట్ల మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అన్యాయం జరిగినా భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వృద్ధుల సంరక్షణ బాధ్యత కుటుంబ సభ్యులదేనని, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. గ్రామస్థులందరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. ఏదైనా న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హత్నూర పోలీస్ సబ్‌ఇన్స్పెక్టర్, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు





## టి జె ఏ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా దేవరంపల్లి అశోక్

**అఖండ సూర్య సంగారెడ్డి/**

తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తు టి జె ఏ చైర్మన్ నియామక పత్రాన్ని అందజేసారు. అనంతరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి అశోక్ మాట్లాడుతూ నాపై నమ్మకం తో నాను నియమిచ్చిన చైర్మన్ ఉప్పల లక్ష్మణ్ గారికి, రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ రావు గారికి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం ఆర్ గోరి గారికి,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి శ్రీనివాస్ గారికి మరియు రాష్ట్ర కోశాధికారి ఖీలీల్ సబ్ గారికి, జిల్లా అధ్యక్షులు సిద్ధిక్ సబ్ గారికి హృదయ పూర్వక ధన్యవాదములు, జిల్లా లో టి జె ఏ ను బలోపేతం చేస్తానని ఈసందర్భంగా తెలియ జేస్తున్నాను.



# కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య

**అఖండ సూర్య గోదావరిఖని**

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యా, సంక్షేమ మౌళిక వసతుల అభివృద్ధి సంస్థ ద్వారా స్థానిక హనుమాన్ నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం, పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ ఈ నిధులతో విద్యార్థులకు సౌకర్యవంతమైన తరగతి గదులు, మెరుగైన మౌళిక వసతులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. విద్యా వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతి పల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు నెల కంటి రాము,యుగేందర్, రామగుండం ఎంఈఓ జింక మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు భరోసా



**అఖండ సూర్య సంగారెడ్డి**

నేతన్న భరోసా పథకంలో భాగంగా నేడు తేదీ 21 04 2026 మంగళవారం రోజున సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం నందు గౌరవ అడిషనల్ కలెక్టర్ పాండు గారి చేతుల మీదుగా జిల్లా లోని 31 మంది చేనేత కార్మికులకు తొలి త్రైమాసికం కు సంబంధించిన రూపాయలు 97,500/ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సహాయ సంచాలకులు హబీబ్ వెంకట రావు గారు చేనేత మరియు జౌలి శాఖ ,జోగిపేట హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వర్కల అశోక్ గారు ,అభివృద్ధి అధికారి లలిత గారు చేనేత మరియు జౌలి శాఖ మరియు సహాయ అభివృద్ధి అధికారి ప్రశాంత్ గారు చేనేత మరియు జౌలిశాఖ, కార్యాలయ సిబ్బంది షరీఫ్ గారు మరియు జోగిపేట మరియు నారాయణఖేడ్ చేనేత సంఘాలకు సంబందించిన చేనేత మరియు అనుబంధ కార్మికులు పాల్గొనడం జరిగింది.మా యొక్క చేనేత సహకార సంఘం కార్మికులకు ఇట్టి ప్రయోజనం కల్పించిన గౌరవ మంత్రి దామోదర్ రాజనరసింహ గారికి మరియు ముఖ్యమంత్రి వర్యులు గౌరవ రేవంత్ రెడ్డి గారికి మా యొక్క సంఘం తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా సంఘ అధ్యక్షులు వర్కల అశోక్ గారు తెలియచేయడం జరిగింది.

# కృష్ణ వేణి విద్యా సంస్థలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




**అఖండ సూర్యగోదావరిఖని**

నగరంలోని కృష్ణవేణి విద్యాసంస్థలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయ కాలనీలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల చదువుతున్న యు కే జీ, 5వ తరగతి విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్ రెడ్డి లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రయాణంలో వారికి మద్దతుగా నిలిచిన తల్లిదండ్రులు, స్నేహితులు, గురువులకు కృతజ్ఞతలు తెలిపే ప్రత్యేక సందర్భమే ఈ గ్రాడ్యుయేషన్ డే అని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాలలో వారి సహకారం, పాత్రను గుర్తించే రోజుగా ఈ వేడుకను చిన్నారుల చేత నిర్వహించడం విశేషమని తెలిపారు. ఈ సందర్బంగా చిన్నారులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో అకాడమిక్ ప్రిన్సిపల్ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు రాజీరెడ్డి, సత్యనారాయణ, సిరాజ్ బేగ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీఎం.. ఎన్డీఏ నేతలతో స్నేహం

**హైదరాబాద్, అఖండ సూర్య :**

జాతీయ రాజకీయాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెంటర్ ఆఫ్ ద అట్రాక్షన్ గా నిలుస్తున్నారు. ఎన్డీఏ నేతలతో ఆయన నెరుపుతున్న స్నేహం జాతీయ మీడియాను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రధానంగా కేంద్రం తీసుకువచ్చిన డీలిమిటేషన్ బిల్లుపై తొలి నుంచి తీవ్ర వ్యతిరేక స్వరం వినిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర దక్షిణాది సీఎంలను కార్యోన్ముఖులు చేశారని అంటున్నారు. దీంతో అటు కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా రేవంత్ రెడ్డికి ప్రాధాన్యం పెరిగింది. ఇలాంటి మయంలో ఆయన ఎన్డీఏ నేతల విందు భేటీకి హాజరై తనదైన రాజకీయాన్ని ఆవిష్కరించారనే చర్చకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం జాతీయ రాజకీయ పరిణామాలు గమనిస్తే అధికార ఎన్డీఏ కూటమి, విపక్ష ఇండియా కూటమికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. కానీ, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఎన్డీఏ కూటమి నేతలు నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ భేటీకి హాజరుకావడం తీవ్ర చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. మహిళా బిల్లు



ఓడిపోయిన కారణంగా అటు బీజేపీ పెద్దలు, ఇటు కాంగ్రెస్ నేతలు తదుపరి వ్యూహంపై సమాలోచనలు చేస్తున్న సమయంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎన్డీఏ ఎంపీలు, ఇతర నేతలతో సరదాగా గడపడమే హాట్ టాపిక్ అవుతోంది. పార్లమెంటు ప్రత్యేక స నియర్లు వెళ్లారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి కూడా వారిని కలిసేందుకు మంత్రి శ్రీనివాస వర్మ నివాసానికి వెళ్లారని అంటున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణకు చెందిన బీజేపీ నేత లక్ష్మణ్ కూడా హాజరయ్యారు. అంతా కలిసి సరదాగా మాట్లాడుకున్నారు.

# రామగుండం నవ నిర్మాణంలో చెరువుల పునరుద్ధరణ

- ఎమ్మెల్యే ఎం ఎస్. రాజ్ ఠాకూర్

**గోదావరిఖని ఏప్రిల్ 21 మన సాక్షి**

రామగుండం నవనిర్మాణంలో భాగంగా చెరువుల పునరుద్ధరణ చేపడుతు న్నామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. అమృత్ 2.0 నిధులు రూ. 2.53 కోట్లతో రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రశాంత్ నగర్ మల్లపు రాణి కుంట,రూ 1.81 కోట్లతో మల్కాపూర్ బామండ్ల కుంట చెరువుల పునరుజ్జీవన పనులను నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి మంగళ వారం ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పునరుజ్జీవన పనుల్లో భాగంగా చెరువుల సుందరీకరణతో పాటు స్థానికులకు ఆహ్లాదాన్ని అందించడానికి ఈ రెండు చెరువుల వద్ద గార్డెన్ , వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మల్కాపూర్ , ప్రశాంత్ నగర్ లలోని లోతట్టు ప్రాంతాలు గతంలో వరద ముంపుకు గురై స్థానికులు అనేక ఇక్కట్లు ఎదుర్కున్నారని గుర్తు చేసుకున్నారు. మరో సారి వరద ముప్పు ఏర్పడకుండా కాలువల నిర్మాణంతో కాలువల్లో పూడిక తీత పనులు చురుగ్గా నిర్వహించడం జరుగుతు న్నదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులతో పాటు పేదలు ,మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. రామగుండం నగరాన్ని వ్యాపార , విద్యా , వైద్య కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా ఉపాధి కల్పనా కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ చెరువుల పునరుజ్జీవన పనులతో పాటు మూడవ డివిజన్ కార్పొరేటర్ వడ్లూరి రవి అభ్యర్థన మేరకు మరో కోటి రూపాయల పనులను ఎం ఎల్ ఎ మంజూరు చేశారని అన్నారు. మే నెల రెండవ వారంలో ఈ నిధులతో మూడవ డివిజన్ లో రోడ్లు , కాలువలు నిర్మాణం ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , కార్పోరేటర్లు వడ్లూరి రవి , వెంగళ బాపు , చిదురాల నాగరాజు , కొలని కవిత ,ధూళికట్ట సతీష్ ,పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం డి. ఇ.నర్సింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.



# జనాభా దామాషా ప్రకారం స్థానిక, పార్టీ పదవులలో అవకాశాలు కల్పించాలి





- మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్

**అఖండ సూర్య సంగారెడ్డి**

సంగారెడ్డి లో కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ సమావేశం.. మంత్రులు దామోదర, కాంగ్రెస్ నాయకుల తో కలిసి పాల్గొన్న నీలం మధు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలు, కాంగ్రెస్ పార్టీ పదవులలో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని, సామాజిక న్యాయం పాటించినప్పుడే పార్టీకి క్షేత్రస్థాయిలో తిరుగులేని విజయం లభిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ స్పష్టం చేశారు. మంగళవారం సంగారెడ్డి పట్టణం లోని రెడ్లాస్ హోటల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి సమక్షంలో జరిగిన ఈ భేటీలో జిల్లా రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహాలపై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, ఏ సామాజిక వర్గానికైనా వారి జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల ఆకాంక్షలను గౌరవిస్తూ టిక్కెట్ల పంపిణీ జరగాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో పార్టీని బలోపేతం చేసేందుకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు దక్కాలని ఆయన కోరారు. మంత్రులు దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ పార్టీ లో వర్గపోరు లేనప్పుడే పార్టీకి లాభం జరుగుతుందని అన్నారు, అందరినీ కలుపుకొని పార్టీని విజయపథంలో నడిపిస్తామని నేతలకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పటాన్చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, గ్రంధాలయ చైర్మన్ ఆంజనేయులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు శశికళ యాదవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, తోపాజీ అనంత కిషన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కాట సుధా, కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

# వ్యక్తిగత దూషణల్లో నేతలు.. ఇద్దరూ.. ఇద్దరే

**హైదరాబాద్, అఖండ సూర్య :**

దేశంలో మిగతా రాష్ట్రాలు వేరు.. తెలంగాణ వేరు. తెలంగాణ ఉత్తి పుణ్యానికి రాలేదు. బలిదానాల మీద.. ఆత్మ త్యాగాల మీద వచ్చింది. ఆశయాల సాధన మీద ఏర్పడింది. అందుకే తెలంగాణ అంటే ఒక పౌరుషం.. తెలంగాణ అంటే బలమైన ఆశయం. తెలంగాణ అంటే పిడికిలి బిగించిన నినాదం. సబ్బండవర్ణాలు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు, నిరసనలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పులు చేస్తేనే తెలంగాణ ఏర్పడింది. అతడు తెలంగాణలో నాయకులు మాట్లాడుతున్న మాటలు చూస్తే జాలి కలుగుతుంది.తెలంగాణలో మర్యాదలు ఎక్కువ గా ఉంటాయి. వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగితే తిట్టే తిట్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఉద్యమాన్ని శంకించిన వారికి.. తెలంగాణ ప్రజల నుంచి ఎటువంటి తిట్లు ఎదురయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అటువంటి సామాజిక ఐక్యత తెలంగాణ ప్రజల్లో నిండి ఉంది కాబట్టి స్వరాష్ట్ర సాధన సాధ్యమైంది. అంతటి గొప్ప విద్వత్తు ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ నాయకులు మాట్లాడుతున్న మాటలు బాధ కలిగిస్తున్నాయి. ఇందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది అనే ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయిరాజకీయ నాయకులు అధికారం కోసం మాత్రమే పాకులాడుతారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనేది వట్టి మాటలు మాత్రమే. ఏదో రాజకీయ ప్రాపకం కోసం అభివృద్ధి చేసినట్టు.. సంక్షేమానికి పాటుపడినట్టు కలరింగ్ ఇస్తుంటారు. లేకపోతే 2014లో మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఏర్పడింది. కెసిఆర్ దిగిపోయే నాటికి రెవెన్యూ లోటుకు దిగజారింది. రేవంత్ పరిపాలనలో కూడా అదే సన్నివేశం కొనసాగుతోంది.. పదవి విరమణ చేసిన ఉద్యోగులకు కనీసం రిటైర్మెంట్ బెనిఫిషరీస్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దీనిని బట్టి తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. త్యాగాల మీద ఏర్పడిన తెలంగాణ ఇలా కావడానికి ముమ్మాటికి రాజకీయ నాయకులు కారణం. అధికారకాంక్ష.. స్వార్థం.. భారీగా వెనకేసుకోవడం వంటి వాటి వల్ల తెలంగాణ సంపద మొత్తం రాజకీయ నాయకుల జేబుల్లోకి చేరిపోయింది. మద్యం అమ్మకాలు గనుక లేకుంటే తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిష్టూరంగా ఉన్నప్పటికీ ఇదే కఠిన నిజం. రాజకీయ నాయకుల వ్యవహార శైలి వల్ల తెలంగాణ పరువు పోతోంది అని చెప్పుకున్నాం కదా.. అది మరోసారి నిరూపితమైంది.. జగిత్యాల సభలో కేసీఆర్ కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఏం బీమారి వచ్చింది? ఏ మాయ రోగం? లాగులు ఇడ్చి కొట్టాలే.. నన్ను ఏం చేస్తావ్ నా కొడకా.. ఇటువంటి మాటలు మాట్లాడారు. వాస్తవానికి కెసిఆర్ నుంచి ఇంతకంటే గొప్పగా తెలంగాణ సమాజం ఆశించదు. కఠినంగా ఉన్నప్పటికీ ఇదే నిజం. కాకపోతే కెసిఆర్ గత సంభాషణలు ఉంటే ఆయన నోటి నుంచి వచ్చిన ఆణిముత్యాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం అవుతుంది.రేవంత్ రెడ్డి కూడా ఇందులో తక్కువ తినలేదు. భూపాలపల్లి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో జీవన్ రెడ్డిని గట్టిగానే తిట్టారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది.. జీవన్ రెడ్డి ఎందుకు మోసం చేశాడు.. అనే అంశాలపై రేవంత్ లోతుగానే మాట్లాడారు. కొన్ని సందర్భాలలో రేవంత్ రెడ్డి అదుపుతప్పారు. ఇక కెసిఆర్ ను కూడా అదే స్థాయిలో విమర్శించారు. కర్కోటకుడు అని సంబోధించారు. పాపాత్ముడు అంటూ మండిపడ్డారు.. కెసిఆర్ లాంటి ద్రోహిని వదిలిపెట్టే సవాల్ లేదని శపథం చేశారు.అటు రేవంత్ రెడ్డి, ఇటు కెసిఆర్ సీనియర్ నాయకులు. తిట్టుకుంటూనే రాజకీయమంటే అంతకు మించిన మూర్ఖత్వం ఉండదు. వ్యక్తిగత కోపాలు ఉంటే నేరుగా తేల్చుకోవాలి. అలాకాకుండా జనాన్ని ప్రభావితం చేసే విధంగా మాట్లాడటం ఎందుకు. రాజకీయాలు అంటే వ్యక్తిగత కక్షలకు వేదికలు కావు కదా.. విధానాలపరంగా నేతలను విమర్శించాలి. ఏవైనా తప్పులు చేస్తే ఎండగట్టాలి. అక్రమాలకు పాల్పడితే న్యాయస్థానాలకు ఈడ్చాలి. అలా కాకుండా ఇలా తిట్టుకోవడం.. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ఎటువంటి రాజకీయాలకు నిదర్శనమో కెసిఆర్, రేవంత్ రెడ్డి చెప్పాలి. ఇటువంటి రాజకీయాల కోసం కాదు తెలంగాణ తెచ్చుకుంది.



# బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ

- ప్రీతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తున్న మల్లారెడ్డి

**హైదరాబాద్, అఖండ సూర్య**

తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ అనూహ్య మలుపులకు వేదికవుతూనే ఉంటాయి. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం అటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ.. ఇటు దేశ రాజధాని ఢిల్లీలోనూ పెను చర్చకు దారితీసింది. మల్లారెడ్డి వంటి సీనియర్ నేత.. అదీ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యే, నేరుగా ప్రధానిని కలవడం వెనుక ఉన్న రాజకీయ గూఢార్థాలు ఇప్పుడు విశ్లేషణలకు పని పెడుతున్నాయి వారసత్వ రాజకీయాల కొత్త అడుగు ఈ భేటీలో అందరినీ ఆకర్షించిన ప్రధానాంశం మల్లారెడ్డి తన కోడలు ప్రీతిరెడ్డిని వెంట తీసుకెళ్లడం.. సాధారణంగా రాజకీయ నాయకులు తమ వారసులను జాతీయ స్థాయి నేతలకు పరిచయం చేస్తున్నారంటే.. అది భవిష్యత్తు ప్రాతినిధ్యానికి పునాది అని అర్థం. గత కొంతకాలంగా ప్రీతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనే తన కోరికను ఆమె గతంలోనే బహిరంగ పరిచారు. ఇప్పుడు ప్రధాని మోదీతో భేటీ ద్వారా.. ఆమెను బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపే దిశగా మల్లారెడ్డి పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. తెలంగాణలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బీఆర్ఎస్ లో ఒక విధమైన సందిగ్ధత నెలకొంది. పార్టీలోని కీలక నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. మల్లారెడ్డికి మేడ్చల్, మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో బలమైన ఆర్థిక, సామాజిక పట్టు ఉంది. ఆయన వంటి నేత పార్టీని వీడితే అది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది. అయితే బీఆర్ఎస్ శ్రేణులు దీనిని ''మర్యాదపూర్వక భేటీ''గా అభివర్ణిస్తున్నప్పటికీ రాజకీయాల్లో 'అకస్మాత్తు మర్యాదలు' ఉండవనేది జగమెరిగిన సత్యం. మరోవైపు తెలంగాణలో పాగా వేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి మల్లారెడ్డి వంటి 'మాస్' ఇమేజ్ ఉన్న నేతలు అవసరం. ఆర్థిక వనరులు, విద్యా సంస్థల నెట్‌వర్క్ ఉన్న మల్లారెడ్డి కుటుంబం బీజేపీలోకి వస్తే, అది పార్టీకి అదనపు బలాన్ని ఇస్తుంది. బండి సంజయ్‌తో ప్రీతిరెడ్డి గతంలో జరిపిన భేటీని, ఇప్పటి మోదీ భేటీని కలిపి చూస్తే.. మల్లారెడ్డి కుటుంబం కమల తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఖరారైనట్లే కనిపిస్తోంది. . కేవలం ప్రయోజనాలు మాత్రమే ఉంటాయన్న నానుడి మల్లారెడ్డి విషయంలో మరోసారి రుజువయ్యేలా ఉంది. ఒకవేళ మల్లారెడ్డి బీజేపీ గూటికి చేరితే, అది తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుంది. తన రాజకీయ వారసురాలిగా కోడలు ప్రీతిరెడ్డిని ఢిల్లీ పీఠం వైపు నడిపించేందుకు మల్లారెడ్డి వేసిన ఈ 'మాస్టర్ ప్లాన్' ఎంతవరకు పారుతుందో కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా ఈ భేటీ బీఆర్ఎస్ శిబిరంలో ఆందోళనను, బీజేపీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపిందనడంలో సందేహం లేదు. రాబోయే రోజుల్లో వెలువడే అధికారిక ప్రకటనలు తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని ప్రకంపనలు సృష్టించవచ్చు.

# 3 బీహెచ్‌కే కంప్లల్సరీ అంటున్న హైదరాబాదీలు

**హైదరాబాద్, అఖండ సూర్య**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు 'సొంత ఇల్లు' అంటే 2 బీహెచ్‌కే అనేది మధ్య తరగతి కలగా ఉండేది, కానీ ఇప్పుడు ఆ ఆలోచనా ధోరణిలో స్పష్టమైన మార్పు వచ్చింది. కేవలం తల దాచుకోవడానికే కాకుండా, ఇంటిని ఒక ఆఫీసుగా, వినోద కేంద్రంగా మార్చుకోవాలనే తపన హైదరాబాద్ వాసుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 4బీహెచ్‌కే లే హాట్ కేకులు! హైదరాబాద్ మహానగరం ఇప్పుడు కేవలం ఐటీ హబ్‌గానే కాదు.., లగ్జరీ రియల్ ఎస్టేట్ రాజధానిగా కూడా అవతరిస్తోంది. గతంలో ఇల్లు అంటే కేవలం బెడ్రూంలు, హాల్ మాత్రమే అనుకునే వారు, కానీ కొవిడ్ తర్వాత మారిన జీవనశైలి ప్రజల ప్రాధాన్యతలను పూర్తిగా మార్చేసింది. నేడు కొనుగోలుదారులు చిన్న ఇళ్ల కంటే విశాలమైన 3బీహెచ్‌కే లేదంటే 4బీహెచ్‌కే ఫ్లాట్ల వైపునకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా కోకాపేట నుంచి తెల్లాపూర్ వరకు ఆకాశహర్మ్యాలు వెలుస్తూ, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఈ మార్పు రావడానికి ప్రధాన కారణం 'వర్క్ ఫ్రమ్ హోమ్' లేదా 'హైబ్రిడ్ వర్కింగ్' మోడల్. సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, కార్పొరేట్ ఉద్యోగులు రోజుకు కనీసం 8 నుంచి10 గంటలు ఇంటి నుంచే పని చేయాల్సి వస్తోంది. దీంతో బెడ్రూమ్‌లో కూర్చొని పని చేయడం కంటే, ఏకాంతంగా ఉండే ఒక ప్రత్యేకమైన ఆఫీస్ గది అవసరమని భావిస్తున్నారు. అందుకే 2బీహెచ్‌కే లో సరిపెట్టుకోకుండా, అదనంగా ఒక గది ఉండేలా 3బీహెచ్‌కే లేదా 4బీహెచ్‌కే కావాలని కోరుకుంటున్నారు. ఆ నాలుగో గదిని ఆఫీసుగానో, లైబ్రరీగానో లేదా కిడ్స్ ప్లే ఏరియాగానో వాడుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలోని పడమర (భాగం ఇప్పుడు లగ్జరీ నిర్మాణాలకు చిరునామాగా మారింది. కోకాపేట, నార్సింగి, తెల్లాపూర్, గండిపేట వంటి ప్రాంతాల్లో చదరపు అడుగు ధర ?9,000 నుంచి ?15,000 వరకు ఉన్నప్పటికీ, డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు. కోకాపేటలో వెలుస్తున్న నియోపోలిస్ వంటి అత్యాధునిక లేఅవుట్లు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను కల్పిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీల్లో క్లబ్ హౌస్‌లు, ఒలింపిక్ సైజ్ స్విమ్మింగ్ పూల్స్, విశాలమైన బాల్కనీలు, గ్రీన్ జోన్స్ ఉండడం సంపన్న వర్గాలను, సీనియర్ ఐటీ ప్రొఫెషనల్స్ను విపరీతంగా ఆకర్షిస్తోంది. ప్రజలు ఇల్లు కొనేటప్పుడు కేవలం ప్రస్తుత అవసరాలనే కాకుండా, రాబోయే 1015 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుంటున్నారు. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి మళ్లీ కొంత మేర పెరుగుతుండడం లేదా తల్లిదండ్రులు, అతిథులు వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఉండాలని పెద్ద ఇళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. చిన్న ఇళ్ల కంటే పెద్ద లగ్జరీ ఇళ్లకు భవిష్యత్తులో రీసేల్ వాల్యూ ఎక్కువగా ఉంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. రియల్ ఎస్టేట్ నిపుణుల అంచనా ప్రకారం, 2026 చివరి నాటికి హైదరాబాద్‌లో అమ్ముడయ్యే మొత్తం ఫ్లాట్లలో 60 శాతానికి పైగా 3బీహెచ్‌కే , అంతకంటే పెద్దవే ఉండే అవకాశం ఉంది. ఇది హైదరాబాద్‌ను ముంబై, బెంగళూరు వంటి నగరాల కంటే ఖరీదైన మార్కెట్‌గా మారుస్తోంది. కేవలం మధ్యతరగతి మార్కెట్ నుండి 'ప్రీమియం మార్కెట్' వైపు హైదరాబాద్ అడుగులు వేస్తోంది. ఈ లగ్జరీ ట్రెండ్ నగర ప్రతిష్టను పెంచుతున్నప్పటికీ, సామాన్యుడికి మాత్రం గగనం అవుతోంది. భూముల ధరలు పెరగడంతో బిల్డర్లు కూడా చిన్న ఇళ్ల కంటే లాభాలు ఎక్కువగా వచ్చే పెద్ద ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు.



# నంద్యాల మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రం

**అఖండ సూర్య నంద్యాల**

నంద్యాలలోని మార్కెట్ యార్డ్ నందు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జొన్నలకు కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.3699గా నిర్ణయించినట్లు తెలిపారు. రైతులకు న్యాయమైన ధర అందించడమే లక్ష్యంగా ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రైతులు తమ పంటను దళారులకు విక్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని, దీంతో మధ్యవర్తుల దోపిడీ నుంచి రక్షణ లభిస్తుందని మంత్రి సూచించారు. అలాగే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజు 'స్టాప్ వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహణ

- ప్రజల భద్రతే లక్ష్యంగా విస్తృత తనిఖీలు.

**అఖండ సూర్య నంద్యాల**

రోడ్డు ప్రమాదాలు నియంత్రించుటకు ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులలో స్టాప్ వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించడంతో పాటు వాహనాలు తనిఖీ చేయాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ ఆదేశాలమేరకు పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో ప్రైవేట్ వాహనాలు,ఆర్టీసి ట్రావెలింగ్ బస్సులలో ముఖ్యంగా రాత్రి పూట తిరిగే వాహనాలలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు, సరైన భద్రతా చర్యలు,జాగ్రత్తలు పాటించాలని బస్సులలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు నంద్యాల పోలీసులు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు జిల్లా రాత్రిపూట తిరిగే వాహనాలను ఆపి "స్టాప్ వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కడప నుండి నంద్యాల హైవే,కర్నూలు నుండి విజయవాడ వెళ్ళే వాహనాలు ,నంద్యాల నుండి కర్నూలు NH 44 హైవే,కర్నూలు నుండి బెంగుళూరు వైపు వెళ్ళే వాహనాలు జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాలలో ఈ "స్టాప్ వాష్ అండ్ గో "కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అంతేకాక వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవర్ల లైసెన్సుల వంటి భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలని డ్రైవర్లకు గుర్తు చేస్తున్నారు. వాహనాలను అతి వేగంతో నడపకుండా, రాంగ్ రూట్ లో వెళ్ళకుండా, పరిమితికి మించి ప్రయాణీకులకు ఎక్కించుకునే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా పోలీసులు తెలియజేశారు.

# మానవత్వం చాటుకున్న మహానంది పోలీస్



**అఖండ సూర్య,మహానంది**

ఖాకీ అంటే కఠినం కాదు. మనసున్నవారు కూడా అని నిరూపించాడు మహానంది పోలీస్.మంగళవారం నంద్యాల సమీపంలోని సుగాలి మెట్ట దాటిన తర్వాత శ్రీనగరం గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. విధుల్లో భాగంగా అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ నారాయణ స్వామి మండుటెండను సైతం లేక్క చేయకుండా ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పైకి లేపి నీళ్లు తాపించి 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అటుగా వెళ్తున్న వాహనదారులు పోలీస్ సేవలను చూసి శభాష్ పోలీస్ అంటూ జై కొట్టారు.

# రుద్రవరం పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన భూమా అఖిల ప్రియా,భార్గవ రామ్ దంపతులు



**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ తాలూకా రుద్రవరం మండల కేంద్రంలోజరుగు చున్న పెద్దమ్మతల్లి దేవరలో గ్రామ టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు మంగళవారం నాడురుద్రవరం గ్రామం వెళ్లి పెద్దమ్మ తల్లి దర్శించుకుని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామ టీడీపీ నాయకుల ఇంటికి వెళ్లి విందులో పాల్గొన్నారు., ఈ కార్యక్రమంలో రుద్రవరం మండల టిడిపి నాయకులు, భూమా కార్యకర్తలు పాల్గొన్నారు..

# ముళ్ళ పొదలతో నిండిన స్మశాన వాటికకు మోక్షం

**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి**

ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధి లోని పడకండ్ల గ్రామంలోని హిందూ శ్మశాన వాటిక పూర్తిగా కంపచేట్లు, ముళ్ళపొదాలతో నిండి పోవడంతో శ్మశాన వాటిక వెళ్ళేందుకు రాస్తా లేక పోవడంతో రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు కోరారు. దీనితో విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యములో శ్మశాన వాటికను శుభ్రం చేశారు. జేసిబి సహాయంతో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ఆవుల భాస్కర్ రెడ్డి ముళ్ళ పొదల ను తొలగించి మూసుకుపోయిన రహదారి నీ బాగు చేసి రహదారి సౌకర్యం ఏర్పాటు చేశారు . ఈ కార్య క్రమములో గ్రామ పెద్దలు బద్రి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వివో ఏ లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ ప్రారంభం

- జిల్లాలో 1,086 మంది లబ్ధిదారులకు 5జి ఫోన్లు
- స్వయం సహాయక సంఘాల సేవలకు సాంకేతిక బలం
- మొబైల్ బుక్ కీపింగ్‌తో ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత

**అఖండ సూర్య నంద్యాల:-**



గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ కు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో వివిఏ లకు స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసే దిశగా నంద్యాల జిల్లాలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ స్మార్ట్‌ఫోన్లు కీలకంగా ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 1,086 మంది VOAలకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యాధునిక 5G సదుపాయం కలిగిన స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేయడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం నియోజకవర్గాల వారీగా ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్లు గ్రామీణ మహిళా సంఘాల అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సంఘాల ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సులభతరం అవుతుందని, ముఖ్యంగా మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహణకు ఇది ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అలాగే 'మన డబ్బులు - మన లెక్కలు' వంటి ఆర్థిక నిర్వహణలో పారదర్శకత పెంపొందించేందుకు ఈ పరికరాలు ఉపయుక్తమవుతాయని చెప్పారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని వేగవంతంగా గ్రామీణ ప్రజలకు చేరవేయడంలో కూడా ఈ స్మార్ట్‌ఫోన్లు కీలకంగా ఉపయోగపడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సాంకేతికత వినియోగం మరింత విస్తరించాలని, VOAs ఈ సదుపాయాన్ని సమర్థంగా వినియోగించి సంఘాల పురోగతికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ పిడి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు

# విద్యార్థినిలకు అన్ని సదుపాయాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో:-**

పాఠశాలల్లో విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తుగ్గలి మండలంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్, బోరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ మరియు బోర్‌వెల్ వ్యవస్థలను తనిఖీ చేసి, విద్యార్థినులకు సరిపడా శుద్ధమైన తాగునీరు అందుతున్నదా అనే అంశంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వ, సరఫరా విధానం, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వసతి గృహంలో విద్యార్థినులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, భోజన సదుపాయాలు, నివాస గదుల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొద్ది రోజుల క్రితం ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేస్తున్న సమయంలో ఆశ్రమంలో తాగునీటి సమస్య ఉన్న విషయాన్నికలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామని, దీనిపై కలెక్టర్ స్పందించి వారి ఆదేశాల మేరకు ప్రస్తుతం వాటర్ ట్యాంక్‌తో పాటు ఆర్.ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చామని, దీంతో విద్యార్థినులకు శుద్ధమైన తాగునీరు నిరంతరం అందుతున్నదని అధ్యాపకులు కలెక్టర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ మధుసూదన్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



# ఎగువ అహోబిలంలో అత్యంత వైభవంగా ధ్వజా రోహణం

**అఖండ సూర్య, ఆళ్లగడ్డ ప్రతినిధి**

ఎగువ అహోబిలం క్షేత్రంలో శ్రీ నరసింహా స్వామి వారి జయంతి బ్రహ్మోత్సవాలలో భాగంగామంగళ వారం ఉదయం ఆలయ ముద్ర కర్త వేణుగోపాల్ ఆధ్వర్యములో ఆలయ అర్చక స్వాములు గరుడ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజ స్తంభము పై ఎగుర వేస్తూ, అష్ట అధిక్పా లకులును, 33 కోట్ల బ్రహ్మాది దేవతలను ఎగువ అహోబిలం క్షేత్రంలో 11 రోజుల పాటు జరిగే శ్రీ నృసింహ వారి జయంతి బ్రహ్మోత్సవాలకు ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా ఆహ్వానించారు. అనంతరం బేరీ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ జ్వాలా నరసింహా స్వామి ,అమ్మ వార్లకు వేద మంత్రోచ్ఛరణల మధ్య భక్తుల హరినామ సంస్కరణల మధ్య ఆలయ అరాచక స్వాములు అభిషేకం చేశారు. రాత్రి సింహ్మ వాహనం పై శ్రీ జ్వాలా నరసింహ స్వామి తిరు వీధుల్లో ఊరేగుత బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు దర్శన భాగ్యంకలిగించారు. ఈ ఉత్సవంలోముద్రకర్త కిడాంబి వేణుగోపాలన్, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ పార్థసారథి , మణియార్ సౌమ్యనారాయణన్ అర్చకులు కల్యాణ రంగన్,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.









# విద్యార్థులకు చెప్పులు పంపిణీ



**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి,**

ఆళ్లగడ్డ నియోజక వర్గంలోని రుద్రవరం మండలము హరినగరంగ్రామములోని ప్రాథమిక పాఠశాలలో 52 మందికి విద్యార్థులకు సమాజ సేవకులు ,అధ్యాపకులు డా.సి.గంగన్న పాదరక్షలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధ్యాపకులు ,సమాజ సేవకులు గంగన్న మాట్లాడుతూ, 20వ తేదీన బడిబాట కార్యక్రమములో విద్యార్థులు ర్యాలీ వెళ్లుచున్న సమయంలో, ఎవరికి చెప్పులు లేవనీ నాకు కొంచెము బాధ కలిగిందన్నారు. వెంటనే మా భార్యకు తెలియచేసినాను. మీరు సమాజ సేవకులు కదా, అందులో ఈ సంవత్సరము ఎండలు ఎక్కువ గా ఉన్నాయి , అందులో పల్లెటూరులో పేద విద్యార్థులు ఎక్కువ ఉంటారని చెప్పినారు. నేను ఏ సేవా కార్యక్రమాలు నిర్వహించిన మా భార్య పూర్తి మద్దతు ఇస్తున్నారు. ఏ పనిచేస్తున్నా ఓ స్త్రీ వుంటుందని అంటారు, నా వెనుక మా భార్య వుంది అని గర్వంగా చెప్తుతున్నాను. ముఖ్యంగా చదువుకునే రోజులలో మేము కూడ పేద వాళ్లమే, ఆ రోజులలో డబ్బులు లేక నన్ను కూడ స్నేహితులు చదివించారు, అది ఇప్పటికీ మరిచి పోలేదు. తల్లిదండ్రుల లేని పిల్లలు వుంటే వారికి ఆర్థికంగా భరోస ఇస్తు నేనే జీవితాంతం చదివిస్తాను అని చెప్పారు. ఈ కార్యక్రమములోయం.ఈ ఓ.2 లక్ష్మిదేవి,ప్రధానోపాధ్యాయులుజెర్సీ,ఉపాధ్యాయులు, జాన్సన్, మల్లీశ్వరి పాల్గొన్నారు.

# చివరి విడత జనగణనపై శిక్షణ కార్యక్రమాలు ముగింపు

**జూపాడు బంగ్లా అఖండ సూర్య**

జనగణన జూపాడు బంగ్లా మండలంలో పగడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ వి. చంద్రశేఖర్ నాయక్ యం.పీ.డీ.ఓ డి గోపీ క్రిష్ణ ఎన్యూమటేటర్లు సూపర్ వైజర్లు కు సూచించారు. మొత్తం 41 మంది ఎనిమిరేటర్లు సూపర్వైజర్లు ప్రభుత్వ పాఠశాల, జూపాడు బంగ్లా మండలం లో శిక్షణ కార్యక్రమంనకు హాజరయ్యారని, చివరి రోజున శిక్షణ తో పాటు హెచ్ ఎల్ ఓ టెస్టు యాప్ ను ఫీల్డ్ ట్రైనర్లు ద్వారా ఎనిమిరేటర్లు సూపర్వైజర్ల కు మొబైల్ లో ఇన్‌స్టాల్ చేసుకొని కొన్ని ఇండ్లను క్షేత్రస్థాయి లో చేశారని తహశీల్దారు తెలిపారు. టెస్టింగ్ కొరకు క్రియేట్ చేసిన యూజర్ ఐ.డీ ద్వారా రోజున టెస్టు యాప్ లో కొన్ని ఇళ్ల ను క్షేత్రస్థాయిలో గణన చేసినట్లు మండల గణాంక అధికారి ఏ.యస్.ఓ హనుమంతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.టీలు సత్యదీప్ నాగన్న పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్యూమరేటర్లు సూపర్వైజర్లందరూ విధిగా స్వీయ గణన చేయాలనీ రేపటి స్వీయ గణన పై ప్రజల్లో అవగాహన కల్పించాలనీ తహశీల్దారు యం.పీ.డీ.ఓ తెలిపారు.



# జొన్నగిరి గోల్డ్ మైన్స్ కి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**అఖండ సూర్య కర్నూలు బ్యూరో:-**

జొన్నగిరి గోల్డ్ మైన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పత్తికొండ ఆర్డీఓ ను ఆదేశించారు. మంగళవారం తుగ్గలి మండలం లోని జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ జొన్నగిరి గోల్డ్ మైన్స్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్లాంట్ లో ప్రారంభ దశ నుండి బంగారం ఉత్పత్తి అయ్యే చివరి దశ వరకు ఉన్న ప్రతి ఒక్క విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా ప్లాంట్ మొత్తం తిరిగి పరిశీలించారు.. సందర్శన అనంతరం పరిశ్రమల శాఖ, APIIC ZM లతో, సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పత్తికొండ ఆర్డీవో, తుగ్గలి తహశీల్దార్ లను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జి పత్తికొండ ఆర్డీఓ APIIC ZM మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవహర్, తుగ్గలి తహశీల్దార్ రవి కుమార్ , సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఫేస్ యాప్ వల్ల ఇబ్బందులు పడుతున్నఉపాధి హామీ కార్మికులు

**అఖండ సూర్య,బనగానపల్లె:**

బనగానపల్లె మండలం మీరాపురం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కార్మికులతో కలిసి సిపిఐ మండల కార్యదర్శి శివయ్య పరిశీలించడం జరిగింది. ఫేస్ యాప్ వల్ల అక్కడే గంట టైం వృధా అవుతుందని నెట్ వర్క్ లేనందున పేర్లు తీసుకోవడం లేదని కావున పాత పద్ధతి కొనసాగాలని గతంలో పనిముట్లకు, నీళ్లకు, చలువ పందిళ్లకు కలిపి ఉపాధి హామీ కార్మికునికి అకౌంట్లో జమ అయ్యేదని కానీ ఇప్పుడు ఆ సదుపాయాలు ఏమీ లేవని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అలాగే కొనసాగించాలని ఏదైతే గతంలో ఉపాధి హామీ పథకానికి కేంద్రం ఇచ్చే నిధులు 90% ఇవ్వాలని రాష్ట్రాలపై భారం మోపద్దని ఉపాధి హామీ కార్మికులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని వారన్నారు. ఈ కార్యక్రమం లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవో వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య అధ్యక్షురాలు ఏలేశ్వరమ్మ మేటిలు పాల్గొన్నారు.



# నేడు తీవ్ర వడ గాలులు వీచే ప్రాంతాలు

- **సంజామలలో 43.2 డిగ్రీలు,గురజాలలో 42.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు.**

**అఖండ సూర్య కర్నూలు బ్యూరో.**

రాష్ట్రంలోబుధవారం పలు ప్రాంతాలలో ఎండ, వడ గాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. బుధవారం 76 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 134 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎల్లుండి 51తీవ్ర, 94 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**తీవ్రవడగాల్పులు వీచే జిల్లాలు:**

శ్రీకాకుళం 19, విజయనగరం 21, మన్యం 3, అల్లూరి 4, పోలవరం 5, విశాఖ1, అనకాపల్లి 15, కాకినాడ 6, తూర్పుగోదావరి 2 మండలాల్లో తీవ్ర వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు. మంగళవారం తిరుపతి(జి) వరదయ్యపాలెం 44.4%C,
ప్రకాశం(జి) కొప్పెరపాడులో 44.1%C, నెల్లూరు(జి) కొమ్మిపాడు, కాకినాడ(జి) కరపలో 43.6%C, కడపలో 43.5%C,అనంతపురం(జి) తెరన్నపల్లిలో 43.4%C, మార్కాపురం(జి) నందనమారెళ్లలో 43.3%C, శ్రీసత్యసాయి(జి) తలుపుల, నంద్యాల(జి) సంజామలలో 43.2%C, పల్నాడు(జి) గురజాలలో 42.9%C, కర్నూలు(జి) తోవి, అన్నమయ్య(జి) నూలివీడులో 42.5%C, చిత్తూరు(జి) తవణంపల్లెలో 42.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. 288 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు వెల్లడించారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మరోవైపు రేపు మన్యం, అల్లూరి, పోలవరం కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు,పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు.

# జింక్ ఫుడ్ వద్దు పౌష్టికాహారం ముద్దు




**అఖండ సూర్య :పుల్లలచెరువు**

పుల్లలచెరువు మండలం మానేపల్లి సెక్టార్ నందు అంగన్వాడి సెంటర్ లో పక్వాడ వేడుకలు నిర్వహించారు ఇందులో భాగంగా గర్భిణీలు బాలింతలు చిన్నారులు జింక్ ఫుడ్ తీసుకోకుండా పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని సూపర్వైజర్ దేవి బాయ్ అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ వేడుకలు జరిపారు. కార్యక్రమంలో బాలింతలు తల్లులు ఆశా వర్కర్లు అంగన్వాడి సెంటర్ కార్యకర్త..ఆయా పాల్గొన్నారు

# మే 09న జాతీయ లోక్ అదాలత్

**అఖండ సూర్య కర్నూలు.**

మే , 09 న అన్ని కోర్టు ప్రాంగణంలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనల మేరకు బుధవారం స్థానిక జిల్లా కోర్టు లోని న్యాయ సేవ సదన్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో వచ్చే నెల మే 09 న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ పై ఇన్సూరెన్స్, మున్సిపల్, ఫైనాన్స్ & చిట్ ఫండ్, బ్యాంక్ మేనేజర్స్, ఇన్సూరెన్స్ న్యాయ వాదులు,బి యస్ యన్ యల్ అధికారులు, పంచాయతీ ఆఫీసర్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులు, మోటార్ ఆక్సిడెంట్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను, బ్యాంక్ డీఫాల్టర్ కేసులను,మున్సిపాలిటీ ప్రాపర్టీ టాక్స్ కేసులు,బియస్ యన్ఎల్ కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్స్,పంచాయతీ ఆఫీసర్స్, మున్సిపాలిటీ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, బిఎస్ యన్ఎల్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# దిగువ అహోబిలం క్షేత్రంలో అంకురార్పణతో శ్రీ నరసింహ స్వామిజయంతిబ్రహ్మోత్సవాలు ప్రారంభం





**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి**

ఆళ్లగడ్డ మండలకేంద్రానికి 23 కీ. మీ. దూరంలో గల దిగువ అహోబిలం శ్రీ ప్రహ్లాద వరద సన్నిధిలో మంగళవారం సాయంకాలం అంకురార్పణ కార్యక్రమము శ్రీ నృసింహ్మ స్వామి వారుజయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ ఆధ్వర్యములో ఆలయ అర్చక స్వాములు అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మొదటశ్రీ ప్రహ్లాదవరద నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనం ఉత్సవం ను ఆలయ వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ మణి యార్ సౌమ్యనారాయణ, అహోబిలం దేవస్థానం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పార్థసారథి,ఆలయఅర్చకులు ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియా ను కలిసిన ఆళ్లగడ్డ నూతన డిఎస్పీ శ్రీనివాసరావు

**అఖండ సూర్య, ఆళ్లగడ్డ ప్రతినిధి**



ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమాఅఖిల ప్రియాను నూతన డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తరువాత శ్రీనివాసరావుమర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి పుష్ప గుచ్చం అందించారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియా మాట్లాడుతూ, నూతన డిఎస్పీ శ్రీనివాస్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆస్తి పన్ను రాయితీలకు విశేష స్పందన

- **నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ**

**అఖండ సూర్య కర్నూలు**

ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీలకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తున్నట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ఏక మొత్తంలో చెల్లించేవారికి 5 శాతం రాయితీ లభించడం వల్ల పన్ను చెల్లింపుల్లో గణనీయమైన పెరుగుదల కనిపిస్తున్నదని వివరించారు. ఇప్పటివరకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.13 కోట్ల వరకు వసూళ్లు నమోదైనట్లు తెలిపారు. నగర అభివృద్ధికి ఆస్తి పన్నులు కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పన్ను చెల్లింపుదారు ముందుకు వచ్చి తమ బకాయిలను ఈ నెల 30 లోపు చెల్లించడం ద్వారా నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పన్నులు చెల్లించడానికి నగరపాలక కార్యాలయానికే రావాల్సిన అవసరం లేదని, సమీపంలోని ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సైతం చెల్లించవచ్చని అదనపు కమిషనర్ సూచించారు.

**ఎక్కడెక్కడ చెల్లించవచ్చంటే..**

నగరపాలక సంస్థ నూతన, పాత కార్యాలయాలతో పాటు దండిగేరి, పెద్దపడఖాప 20,21వ సచివాలయాలు, బి.క్యాంపు, అరోరా నగర్ 56,57వ సచివాలయాలు, గురు రాఘవేంద్ర నగర్, రాజీవ్ గృహకల్ప 92,93వ సచివాలయాలు, కల్లూరు వార్డు కార్యాలయం 84,85వ సచివాలయాలు, లక్ష్మీనగర్, జెఎన్ఆర్ నగర్ 61,62వ సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయి. సెలవు దినాలతో సహా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు చెల్లించే అవకాశం ఉంది.

# మహిళా రిజర్వేషన్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత విచారకరం

**అఖండ సూర్య కర్నూలు.**




మహిళల రిజర్వేషన్ విషయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత విచారకరం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ షాలి దాదా గాంధీ ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు బి క్రాంతి నాయుడు సూచన మేరకు మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లులో మైనారిటీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ఉండదని చెప్పడం సామాజిక న్యాయానికి తీవ్ర భంగం కలిగించే చర్యగా మేము భావిస్తున్నాము. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన నేపథ్యంలో మైనారిటీ మహిళలను ఈ విధంగా పక్కన పెట్టడం వివక్షతను మరింత బలపరచే ప్రమాదకర నిర్ణయం. ఇప్పటికే సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం వారి అభివృద్ధిని అడ్డుకుంటుంది. కాబట్టి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ తరపున మేము ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మహిళల రిజర్వేషన్ చట్టంలో అన్ని వర్గాల మహిళలకు—ప్రత్యేకంగా మైనారిటీ మహిళలకు—సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము; సామాజిక న్యాయం, సమానత్వ సూత్రాలను కాపాడాలని వివక్షాత్మక విధానాలను వెంటనే ఉపసంహరించు కోవాలని ఖాజా హుస్సేన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ మాజీ అధ్యక్షుడు ఎండ్లూరి లాజరస్, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ అబ్దుల్ హై, డిసిసి మాజీ కార్యదర్శి వెల్దుర్తి శేషయ్య మొదలగు వారు పాల్గొన్నారు.

# నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవ వేడుకలు

**అఖండ సూర్య కర్నూలు బ్యూరో.**

కర్నూల్,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు , లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక దూపాడు దగ్గర గల అశోక ఇంజనీరింగ్ కాలేజీ నందు ఏర్పాటుచేసిన ప్రపంచ ధరిత్రీ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ,సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నామని పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించడమే ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఎన్విరాన్ మెంటల్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎవరికైనా చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీహెల్ప్ లైన్ నెంబర్ 15100 కి కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ పి.వి. కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి ఇప్పటికే ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి అని తెలిపారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగ్స్, పేపర్ బ్యాగ్స్ ఉపయోగించవచ్చు అని తెలిపారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు మాట్లాడుతూ ధరిత్రి దినోత్సవం నిర్వహించడం వల్ల పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుంది అని తెలిపారు. దీని వలన భూమిని కాపాడుకోవాలనే బాధ్యత పెరుగుతుందని ప్రభుత్వ సంస్థలు ప్రజలు కలిసి భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందనే భావన పెంపొందుతుంది అని తెలిపారు. అనంతరం లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో భూమిని కాపాడుదామని ప్రతిజ్ఞను నిర్వహించారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం పై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జడ్జి చేతుల మీదుగా సర్టిఫికెట్లు మోమెంటోలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం అశోక ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ కిషోర్ రెడ్డి,కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ యన్.మగేశ్వరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ వెంకట సాయి కిషోర్, అనలిస్ట్ ఇమ్రాన్, రామకృష్ణ,పవన్, అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యన్. మగేశ్వరి , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. ఎ. శివకుమార్, అడ్మినిస్ట్రేటర్ దావల్ ఈశ్వర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వలి, కాలేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు సెంటర్ కు రెండు లక్షలు విలువ చేసే కుట్టుమిషన్ లు పంపిణీ

- **మహమ్మద్ ఇక్బాల్ బాష,విశ్రాంత రాయలసీమ ఐజిపి.**

**అఖండ సూర్య కర్నూలు.**



కర్నూలు నగరం,కల్లూరు అర్బన్,32వ వార్డ్, ముజఫర్ నగర్,టి.సి.లక్ష్మమ్మ కుట్టు సెంటరుకు విశ్రాంత రాయలసీమ ఐజిపి మహమ్మద్ ఇక్బాల్ బాష రెండు లక్షలు విలువ చేసే కుట్టుమిషన్ లు విరాళంగా అందచేశారు ఈ మేరకు మంగళవా రం విశ్రాంత రాయలసీమ ఐజిపి మహమ్మద్ ఇక్బాల్ చేతుల మీదుగా కుట్టు మిషన్లను ఘనంగా ప్రారభించారు కార్యక్రమానికి ట్రాఫిక్ సిఐ ఎస్ మన్సూరుద్దీన్, సిఐటియు ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్,సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యు లు కె .సుధాకరప్ప,లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాబు ,ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జి. ధనలక్ష్మి,సిపిఎం నగర నాయకురాలు లక్ష్మి భాయ్,కుట్టు శిక్షణ కేంద్రం శిక్షకురాలు కుమారి,హాజరయ్యారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి కుట్టుమిషన్ల దాత మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో ఇలాంటి శిక్షణ కేంద్రాలు ప్రజలకు ఉపాధి కేంద్రాలుగా వెలుగొందాలని ఆకాంక్షించారు.ఈ నేపథ్యం లో తమ వంతు సహకారం ఎల్లవేళల ఉంటుందని అన్నారు.అదేవిదంగా కుట్టు శిక్షణ కేంద్రంకు మరుగుదొడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటా మని చెప్పారు శిక్షణ తీసుకుంటున్న మహిళల కు ఆదాయ వనరులు సైతం ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఐద్వా నాయకురాలు లక్ష్మిబా య్ మాట్లాడుతూ మహిళల సమస్యలు గుర్తించి కుట్టు శిక్షణ కేంద్రానికి ఆర్థిక సహకారం అందచేయడం పట్ల మహమ్మద్ ఇక్బాల్ కు అభినందనలు తెలియచేశారు.ఆటో యూనియన్* జిల్లా కా ర్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడుతూ కుట్టు శిక్షణ కేం ద్రం అభివృద్ధికి ట్రాఫిక్ సిఐ ఎస్.మన్సూరుద్దీన్ సహకారం మరువలేనిదని మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రానికి కొత్త వెలుగులు వచ్చాయని అన్నారు.అనంతరం టి.సి.నరసింహయ్య గ్రంధాలయం పరిశీలన చేసిన మహ మ్మద్ ఇక్బాల్ గ్రూప్ 2 చదువుకోడానికి మెటీరియల్స్ కోసం రూ.10వేలు ఆర్థిక సహకారం గ్రంధాలయ అధ్యక్షులు కె.ప్రభాకర్ కు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకు రాళ్లు దానమ్మ,సువార్తమ్మ,శారదమ్మ,గ్రంధాలయ నిర్వాహకులు ఎస్ బషీర్,స్థానిక సిపిఎం నాయకులు వి.విజయ్ కుమార్,ఎస్. షంశీర్, ఎస్.ముక్తియార్,వెంకటేష్, సురేంద్ర, కుట్టు శిక్షణ కేంద్రం మహిళలు,తదితరులు పాల్గొన్నారు

# చైన్ స్నాచింగ్ చేసిన ఇద్దరిలో ఒకరి అరెస్ట్

- **పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం**

**అఖండ సూర్య కర్నూలు.**



ఏప్రిల్ తొమ్మిదో తారీఖు రాత్రి 8 గంటలకు గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని సాయినాథ్ నగర్ లో ఫోన్ మాట్లాడుకుంటూ ఇంటి బయట నడుస్తున్నటువంటి ఒక వివాహిత మెడలో నుంచి హెల్మెట్లు ధరించి జెర్కిన్ లు ధరించి ఒక నల్లటి మోటార్ సైకిల్ పై వచ్చిన ఇద్దరు మగ వ్యక్తులు సదరు వివాహిత మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని హైవే వైపు వెళ్లినట్లుగా వచ్చిన ఫిర్యాదు పై క్రైం నెంబర్ 88/2026గా కేసు నమోదు పరుచుకొనగా అదే రోజు సుమారు 10 గంటల సమయంలో సంతోష్ నగర్ లోని నాగమణి అనే వృద్ధురాలు ఇంటి బయట కూర్చుని ఉండగా హెల్మెట్ లు ధరించినటువంటి ఇద్దరు మగ వ్యక్తులు ఆమెను సమీపించినట్టు అందులో ఒక వ్యక్తి ఆమెను పట్టుకొని కత్తి చూపించి బంగారు గొలుసు లాక్కొని పారిపోతున్న సమయంలో ఆమె గట్టిగా కేకలు వేయగా తన బంధువులు అయినటువంటి కొడుకు , మనవడు వెంటనే బయటకు వచ్చి గట్టిగా కేకలు వేగా అది గమనించిన ఆ ఇద్దరు దొంగలు వారి మోటార్ సైకిల్ లో ఎక్కి హైవే వైపుగా వెళుతూ ఉండగా అందులో నాగమణి యొక్క మనవడు వారిని సమీపించి పట్టుకోడానికి ప్రయత్నించిగా మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో ఇద్దరు కొద్దీ దూరం వెళ్లి మోటార్ సైకిల్ నుండి కింద కి దూకి అక్కడి నుండి తలో దిక్కు పారిపోవడం జరిగింది. సమాచారం అందుకున్న పోలీస్ లు సంఘటన స్థలాన్ని పరిశీలించి, సంఘటనా స్థలం లో దొరికిన మోటార్ సైకిల్, ఒక చిన్న కీ పాడ్ ఫోన్, మరియు వారి బ్యాగ్ లను స్వాదీనం చేసుకొని, సదరు ఘటనపై కేసు నమోదు పరచి, శ్రీయూత కర్నూల్ జిల్లా SP గారైనా విక్రాంత్ పాటిల్వారి పర్యవేక్షణలో ధర్యాప్తు ప్రారంభించి, టెక్నికల్ ఆధారాల సహాయంతో దొంగలు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రము లోని షాంలి జిల్లా కి చెందిన భవారియా గాంగ్ లోని మానవ్ , హరి ప్రకాష్ లు గా గుర్తించి అందులో ఒకరైన మానవ్ ని ఈరోజున బాలాజీ నగర్ నందు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి దొంగలించుకున్న చైన్ లలోని ఒక 2 గ్రాముల బంగారు గొలుసు ముక్కను సీజ్ చేసి రిమాండ్ కి పంపడం జరిగింది... అయితే ఈ నెల 7 వ తారీఖున వీరు ఇద్దరు కలిసి బెంగుళూరు వచ్చి, అటు నుండి అనంతపురం వచ్చి కొవ్వూరు నగర్ లో AP39 JS 2653 అను నెంబర్ కల్గిన పల్సర్ మోటార్ సైకిల్ ను దొంగలించుకొని కర్నూల్ నందు చైన్ స్నాచింగ్ కి పాల్పడినట్టుగా తెలుస్తోంది. మరో ముద్దాయి అయిన హరి ప్రకాష్ గురించి ప్రత్యేక బృందాన్ని పంపించడం జరిగింది. వీరి పై బెంగుళూరు చుట్టూ పక్కల ప్రాంతాలలో 16 కి పైగా కేసులు గలవు. అదే విధంగా హర్యానా, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ లలో కూడా 15 కి పైగా దొంగతనం కేసులు గలవు.

# కేఎంసీ లో 50 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**అఖండ సూర్య కర్నూలు.**

కర్నూల్ మెడికల్ కాలేజీలో 50 లక్షల రూపాయలతో ముఖ్యంగా ఎలక్ట్రిఫికేషన్ , ఫైర్ కు సంబంధించిన పనులను ఏపీఎంఇడిసి ద్వారా చేపట్టామని ఎడి యంఇ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. చిట్టి నరసమ్మ మంగళవారం తెలిపారు. ఇందులో క్లినికల్ ఫ్యాకల్టీ రూమ్ లయందు, నాన్ క్లినికల్ డిపార్ట్మెంట్ లలో లైట్లు, ఫ్యాన్స్, లెక్చరర్ గ్యాలరీలలో అవసరం ఉన్న చోట్ల ఏసీలు ఏర్పాటు చేస్తున్నాం అని తెలిపారు. అదేవిధంగా కాలేజీలో ఫైర్ సేఫ్టీ కి సంబంధించిన అవసరమైన తప్పనిసరి పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# పెట్రోల్ బ్యాంకులు మూసివేత

- **ఇక్కట్లలో వినియోగదారులు.**

**అఖండ సూర్య కర్నూలు బ్యూరో**

పెట్రోలు సరఫరా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో పాలు ప్రాంతాలలో పెట్రోలు బంకులు మూతపడ్డాయి. ఉమ్మడి జిల్లాలోని కర్నూలు,ఎమ్మిగనూరు ,ఆదోని,నంద్యాల ,ఆళ్లగడ్డ,పత్తికొండ,మంత్రాలయం తదితర ప్రాంతాలలో పెట్రోలు బంకులు మూతపడ్డాయి. కర్నూలు,ఎమ్మిగనూరు తోపాటు పలు ప్రాంతాల్లో వాహనదారులకు పెట్రోల్ అందించలేకపోతున్నారు. ఆదోని పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ అయిపోవడంతో ఆస్పరి రోడ్ లో ఉన్న శ్రీ లక్ష్మి చెన్నకేశవ పెట్రోల్ బంక్ లో పెట్రోల్ కోసం వాహనదారులు పెద్ద ఎత్తున తరలి రావడంతో గంటల తరబడి పెట్రోల్ కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఏర్పడింది

# కార్యసాధకులకు హనుమంతుడే ఆదర్శం

- **డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.**
- **తూర్పు ప్రాతకోటలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు**

**అఖండ సూర్య కర్నూలు.**

కార్యసాధకులకు హనుమంతునికి మించిన ఆదర్శం ఎవరూ లేరని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పగిద్యాల మండలం, తూర్పు ప్రాతకోటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలకు వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం హనుమత్త్వంపై ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి ఉపన్యసించారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగలింగమయ్య, దూదేకుల హుసేన్, శివశంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

**అఖండ సూర్య ఎమ్మిగనూరు.**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త బోయ మదన గోపాల్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గోనేగండ్ల మండలం లింగందిన్నె గ్రామాన్నిసందర్శించారు లింగందిన్నె గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోయ మదన గోపాల్ అకాల మరణంపై ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పార్టీకి అంకితభావంతో పనిచేసినందుకు, ఆయన పార్థివ దేహానికి టీడీపీ జెండాను కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అందించి, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్లు, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నకు విరాళం

**అఖండ సూర్య, బనగానపల్లె:**

బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు అనంతపురం జిల్లా, యాడికి మండలం, తూట్రాళ్ళపల్లె గ్రామ వాస్తవ్యులు యలమకూరి రామాంజనేయులు వారి ధర్మపత్ని యలమకూరి నాగేంద్రమ్మ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 1,00,000/ రూ చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



# ఆధార్ అప్‌డేట్‌కు గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి

అని అధికారులు పేర్కొంటున్నారు. ఈ గడువు వరకు ఆధార్ వివరాలను ఉచితంగా సవరించుకునే అవకాశం ఉంటుంది. అయితే జూన్ 15 నుంచి ఆధార్ అప్‌డేట్‌లకు నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుందని UIDAI స్పష్టం చేసింది. అందువల్ల ప్రజలు ఈ గడువును సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తోంది. చివరి నిమిషంలో తొందరపడకుండా ముందుగానే వివరాలు సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆధార్ కార్డు ప్రస్తుతం ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తోంది. సబ్సిడీలు, పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, ఇతర నగదు సహాయాలు—all ఆధార్ ఆధారంగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ అవుతున్నాయి. ఈ ప్రక్రియను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (DBT) అని పిలుస్తారు. ఈ నేపథ్యంలో ఆధార్ వివరాలు సరిగా లేకపోతే లబ్ధిదారులకు సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. బ్యాంక్ ఖాతాలకు నగదు చేరకపోవడం, పథకాల ప్రయోజనాలు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఆధార్‌లోని వ్యక్తిగత వివరాలు, చిరునామా, మొబైల్ నంబర్ వంటి సమాచారం సరిగా ఉండటం చాలా అవసరం. బ్యాంకింగ్ రంగంలో కూడా ఆధార్ కీలక పాత్ర పోషిస్తోంది. కేవైసీ (Know Your Customer) ప్రక్రియలో ఆధార్ ప్రధాన పత్రంగా ఉపయోగిస్తున్నారు. బ్యాంక్ ఖాతాలు తెరవడం, రుణాలు పొందడం, ఇతర ఆర్థిక సేవలు పొందడం—all ఆధార్‌తో అనుసంధానమై ఉన్నాయి. కాబట్టి ఆధార్ అప్‌డేట్ చేయడం ద్వారా ఈ సేవల్లో ఎలాంటి ఆటంకాలు రాకుండా చూసుకోవచ్చు. ప్రత్యేకంగా పదేళ్ల క్రితం ఆధార్ కార్డు తీసుకున్న వారు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా వివరాలను అప్‌డేట్ చేయకపోతే తప్పనిసరిగా సవరణ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కాలక్రమేణా చిరునామా మార్పులు, మొబైల్ నంబర్




మార్పులు, ఇతర వ్యక్తిగత వివరాల్లో మార్పులు రావడం సహజం. ఈ మార్పులను ఆధార్‌లో ప్రతిబింబించడం అవసరం. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ కూడా ఇప్పుడు చాలా సులభంగా మారింది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా సమీప ఆధార్ సేవా కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి సులభంగా వివరాలను సరిచేసుకోవచ్చు. ప్రభుత్వం, UIDAI తరఫున ప్రజలకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది—ఆధార్‌ను నిర్లక్ష్యం చేయొద్దు. ఇది కేవలం ఐడెంటిటీ కార్డు మాత్రమే కాకుండా, అనేక సేవలకు ప్రవేశ ద్వారంగా మారింది. ప్రతి ఒక్కరూ తమ ఆధార్ వివరాలను సమయానికి అప్‌డేట్ చేసుకుంటేనే భవిష్యత్తులో సమస్యలు లేకుండా సేవలు పొందగలుగుతారు. అలాగే ఆధార్‌లో తప్పులు ఉంటే వెంటనే సరిచేయాలని అధికారులు సూచిస్తున్నారు. పేరులో స్పెల్లింగ్ తప్పులు, చిరునామా లోపాలు, పుట్టిన తేదీ పొరపాట్లు—all భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారి తీసే అవకాశముంది. అందువల్ల ఈ అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు. మొత్తంగా ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగింపు ప్రజలకు మంచి అవకాశంగా భావించవచ్చు. జూన్ 14 వరకు ఉన్న ఈ గడువును సద్వినియోగం చేసుకుని ఉచితంగా వివరాలను సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ అవకాశాన్ని కోల్పోతే తర్వాత రుసుము చెల్లించాల్సి ఉంటుందని, అలాగే సేవల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# ఢిల్లీకి వెళ్లడం తప్పా?

మొదటిపేజీ తరువాయి

ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీని నియమించడాన్ని కూడా హరీశ్‌రావు ప్రస్తావించారు. ఈ నియామకం వెనుక ఉద్దేశ్యం ఏమిటో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసు ప్రాముఖ్యత దృష్ట్యా పారదర్శకత అవసరమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటుకు నోటు కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి ముద్దాయిగా ఉన్నారని, గత నాలుగున్నరేళ్లుగా స్టే మీద కొనసాగుతున్నారని అన్నారు. ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా రేవంత్ రెడ్డి రాజకీయంగా వివిధ నేతలను కలుస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఒకవైపు కాంగ్రెస్ నేతలతో, మరోవైపు భాజపా నేతలతో సమావేశాలు నిర్వహించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. రైతు భరోసా అంశంపై కూడా హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ బయటకు వచ్చిన వెంటనే ప్రభుత్వం రెండో విడత రైతు భరోసా విడుదల చేసిందని అన్నారు. ఇది రాజకీయ ఒత్తిడితో తీసుకున్న నిర్ణయమని విమర్శించారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సహాయం పంట చేతికి వచ్చిన తర్వాత ఇవ్వడం వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను హరీశ్‌రావు ఖండించారు. ప్రాజెక్ట్ పూర్తిగా కూ



లిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని, ఇది నిజానికి విరుద్ధమని అన్నారు. ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని తగ్గించేందుకు కావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మొత్తంగా హరీశ్‌రావు చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్, ఓటుకు నోటు కేసు, రైతు భరోసా వంటి అంశాలపై ఆయన చేసిన ఆరోపణలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రం కానున్నదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



# అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు

- **జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువతను అప్రమత్తం చేయడంలో జిల్లా పోలీసు శాఖతో కలిసి పనిచేయాలి.**
- **సంగారెడ్డి జిల్లా సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులను అభినందించి, సత్కరించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్.**

అఖండ సూర్యసంగారెడ్డి

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా (ఏప్రిల్ 1318) వారం రోజుల పాటు నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు విజయవంతం కావడంలో సంగారెడ్డి జిల్లా సాంస్కృతిక సారధి కళాబృందం కీలక పాత్ర పోషించిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. వారి సేవలను గుర్తిస్తూ, అభినందిస్తూ ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆన్లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ప్రజలను చైతన్యం చేయడంలో సాంస్కృతిక సారధి కళాబృందం చేస్తున్న కృషి అభినందనీయమని, ఇదే విధంగా జిల్లా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, వారి భవిష్యత్తుపై దృష్టి సారించేలా మరిన్ని స్కిట్లు, పాటల ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు సునిల్ కుమార్, రమేష్, ఎ.కే. బిక్షపతి, రవీందర్, సంధ్య, స్వప్న, శశిప్రియ, మల్లేష్, సాయిలు, దుర్గేష్, వినేశ్, ఆగమయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.





# రేవంత్ 'రాహువు'.. కేసీఆర్ 'కేతువు'

మొదటిపేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతి పరిమాణం ఎంతన్న దానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. "ఈ ప్రాజెక్ట్‌లో అవినీతి రూ.లక్ష కోట్లు జరిగిందా? లేక రూ.9 వేల కోట్లు మాత్రమేనా?" అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు భారీ అవినీతి ఆరోపణలు వచ్చాయని గుర్తుచేస్తూ, ఇప్పటి ప్రభుత్వం ఆ కుటుంబంలో ఒక్కరిపై అయినా చర్యలు తీసుకుందా అని నిలదీశారు. అవినీతి ఆరోపణలు నిజమైతే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఆయన "ఏటీఎం"గా అభివర్ణించారు. గతంలో బీఆర్ఎస్‌కు ఎలా ఉపయోగపడిందో, ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా అదే విధంగా మారిందని ఆరోపించారు. అధికారాలు మారినా వ్యవహార శైలి మాత్రం మారలేదని విమర్శించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి రాసిన లేఖలపై కూడా బండి సంజయ్ ప్రశ్నలు లేవనెత్తారు. రూ.9 వేల కోట్ల అవినీతిపై మాత్రమే దర్యాప్తు కోరుతూ లేఖ రాయడం



ఎందుకని అడిగారు. అదే సమయంలో లక్ష కోట్ల అవినీతి ఆరోపణలపై ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ఈ లేఖల అసలు ఉద్దేశ్యం ఏమిటో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తాము ఆ లేఖలను కరపత్రాల రూపంలో ముద్రించి ఇంటింటికీ పంచుతామని చెప్పారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ పర్యటనపై కూడా ఆయన స్పందించారు. ఈ పర్యటనపై వేర్వేరు వర్గాలు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. అసలు ఈ పర్యటన వెనుక ఉద్దేశ్యం ఏమిటో స్పష్టత రావాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళలు ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని అన్నారు. అయితే ఈ బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం తగదని, అది పూర్తిగా మూర్ఖత్వమని వ్యాఖ్యానించారు. మహిళా సాధికారతపై కాంగ్రెస్ నిజమైన చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వంటి కుటుంబ సభ్యులకు పదవులు ఇవ్వడం ద్వారా మొత్తం మహిళలకు న్యాయం చేసినట్టుగా భావించడం సరైంది కాదని అన్నారు. కొన్ని కుటుంబాలకు మాత్రమే అవకాశాలు ఇవ్వడం వల్ల సామాన్య మహిళలకు లాభం ఉండదని పేర్కొన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు మాత్రమే పదవులు ఇవ్వడం మహిళా సాధికారత కాదని బండి సంజయ్ స్పష్టం చేశారు. నిజమైన సాధికారత అంటే అన్ని వర్గాల మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమేనని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకపోతే సీఎం రేవంత్ రెడ్డి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మహిళల హక్కులను అవమానించడం వంటిదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ స్థానంలో తనను నిలబెట్టుకోవాలని రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని కూడా ఆయన ఆరోపించారు. జాతీయ రాజకీయాల్లో ఎదగాలనే ఆశతో రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెడుతున్నారని విమర్శించారు. మహిళా బిల్లు ఆమోదం పొందకపోవడానికి తమిళనాడు సీఎం స్టాలిన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని బండి సంజయ్ ఆరోపించారు. వీరి రాజకీయ వైఖరి కారణంగానే ఈ బిల్లు ముందుకు సాగలేదని అన్నారు. ఇక బీజేపీ-బీఆర్ఎస్ కలయికపై వస్తున్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. ఈ రెండు పార్టీలు ఎప్పటికీ కలవవని స్పష్టం చేశారు. కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో స్పష్టమైన ప్రత్యామ్నాయం బీజేపీనేనని బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విసుగు చెందుతున్నారని, త్వరలోనే బీజేపీకి మద్దతు పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తంగా రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్, మహిళా రిజర్వేషన్ బిల్లు, పార్టీలు మధ్య సంబంధాలపై ఆయన చేసిన ఆరోపణలు, విమర్శలు రాబోయే రోజుల్లో రాజకీయంగా మరింత వేడి పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# విభజనపై విషం చిమ్మొద్దు

మొదటిపేజీ తరువాయి

చరిత్రను వక్రీకరించడమే కాకుండా, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య అనవసర విభేదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. రాష్ట్ర విభజన ఒక రాజ్యాంగబద్ధ ప్రక్రియగా జరిగిందని, దాన్ని తిరస్కరించేలా లేదా అపహాస్యం చేసేలా మాట్లాడటం సరైంది కాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు తీసుకున్న తర్వాత వాటిని గౌరవించడం అవసరమని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం గత విషయాలను మళ్లీ తెరపైకి తీసుకురావడం సమాజానికి మేలు చేయదని ఆయన అన్నారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ఈ సమయంలో విభజన అంశాన్ని వివాదాస్పదంగా మలచడం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు వెళ్తేనే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన సూచించారు. తన లేఖలో ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై కూడా మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యలు లోక్‌సభలో నమోదు కావడం దురదృష్టకరమని పేర్కొంటూ, వాటిని అధికారిక రికార్డుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాయాలని కూడా



చంద్రబాబును ఆయన విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు వంటి గౌరవనీయ వేదికలలో బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ప్రజల ముందు ఉన్న నేతలు చేసే ప్రతి వ్యాఖ్య సమాజంపై ప్రభావం చూపుతుందని, అందువల్ల మాటల ఎంపికలో జాగ్రత్త అవసరమని అన్నారు. ఇక రాజకీయ నాయకుల బాధ్యతపై కూడా మంత్రి తన లేఖలో దృష్టి సారించారు. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడం నాయకుల కర్తవ్యమని, విభేదాలను రెచ్చగొట్టడం కాదు అని స్పష్టం చేశారు. ముఖ్యంగా రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన అంశాలపై వ్యాఖ్యలు చేసే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు రెండు రాష్ట్రాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నీటి పంపిణీ, ఆస్తుల విభజన, ఉద్యోగుల సమస్యలు వంటి అంశాలపై పరస్పర చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని సూచించారు. ఈ నేపథ్యంలో రాజకీయ ఉద్రిక్తతలు పెంచే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. తన లేఖ చివర్లో, ఈ అంశాన్ని గంభీరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకుంటారని చంద్రబాబుపై ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాల మధ్య సఖ్యతను కాపాడేందుకు మీ నాయకత్వం కీలకమని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్ర విభజన అంశంపై మళ్లీ చర్చలు రగులుతున్న నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ రాసిన ఈ బహిరంగ లేఖ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణం కొనసాగాలంటే నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ లేఖ మరోసారి గుర్తు చేస్తోంది.



# ఆర్టీసీ సమ్మెకు రంగం సిద్ధం..

మొదటిపేజీ తరువాయి

ఆర్టీసీని నిర్లక్ష్యం చేస్తోందని వెంకన్న ఆరోపించారు. నష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వపరం చేయాలని ప్రయత్నిస్తున్నారని, అదే సమయంలో ప్రజలకు కీలక సేవలు అందిస్తున్న ఆర్టీసీపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. ఆర్టీసీ ఆస్తుల భవిష్యత్తుపై కూడా జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెంకన్న ఆరోపించారు. ఇది సంస్థ భవిష్యత్తుకు ప్రమాదకరమని అన్నారు. హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ సేవలను తగ్గించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు. నగరంలో ఆర్టీసీ ప్రాధాన్యాన్ని తగ్గించి, ఇతర రవాణా వ్యవస్థలకు ప్రోత్సాహం ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉందని విమర్శించారు. ఆర్టీసీకి చెందిన భూముల వినియోగంపై కూడా జేఏసీ నేతలు సందేహాలు వ్యక్తం చేశారు. ఈ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజల ఆస్తులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. సమ్మెకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా మద్దతు ఇవ్వాలని వెంకన్న పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ఉద్యోగులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఉద్యోగుల ఐక్యతే తమ బలం అని పేర్కొన్నారు. ఈ సమ్మె సాధారణ ఉద్యోగుల సమ్మె మాత్రమే కాకుండా, పెద్ద ఉద్యమంగా మారే అవకాశముందని ఆయన హెచ్చరించారు. "ఇది మరో సకల జనుల సమ్మెగా మారబోతోంది" అని స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో ఈ సమ్మె మరింత విస్తృతమవుతుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా వెంకన్న వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని చెబుతూనే, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఖర్చు చేస్తోందని విమర్శించారు. మూసీ అభివృద్ధి వంటి ప్రాజెక్టులు చేపడుతున్నప్పుడు, ఆర్టీసీ సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మొత్తంగా ఆర్టీసీ సమ్మె రాష్ట్రంలో కీలక అంశంగా మారుతోంది. ఉద్యోగుల డిమాండ్లు, ప్రభుత్వ వైఖరి, ఆర్థిక పరిస్థితులు—all కలిసిపోవడంతో ఈ సమ్మె రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది కీలకంగా మారనుంది.

# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

వంటి ప్రదేశాల్లో తాత్కాలిక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం వర్షానికి గురై నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రేషన్ కార్డుల అంశంపై కూడా మంత్రి స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, సుమారు 3.78 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేదలకు నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, తాను తినే బియ్యమే పేదలకు అందిస్తున్నాం" అని మంత్రి అన్నారు. పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే తమ లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వంపై మంత్రి తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల పాలనలో భారీగా అప్పులు చేసి వెళ్లారని విమర్శించారు. ఒకేసారి 'బంగారు తెలంగాణ' సాధ్యం కాదని, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ధాన్యం నిల్వల విషయంలో గతంలో భారీ కుంభకోణం జరిగిందని మంత్రి ఆరోపించారు. సుమారు



రూ.11 వేల కోట్ల మేర అవినీతి జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత మేర ధాన్యం రికవరీ చేయించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ధాన్యం సేకరణలో ఎక్కడా లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. మొత్తంగా రబీ ధాన్యం సేకరణపై మంత్రి చేసిన ఈ సమీక్ష సమావేశం కీలక నిర్ణయాలకు దారితీసింది. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడం, లాజిస్టిక్స్ మెరుగుపరచడం, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.



# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

అఖండ సూర్య సంగారెడ్డి

వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి పరామర్శించారు. కంది మండల బీజేపీ మాజీ అధ్యక్షులు సదానందచారి గారి కుమారుడు ప్రమాదవశాత్తు మృతి చెందగా.. వారి కుటుంబం సభ్యులను జులకల్ గ్రామంలో పరామర్శించి. మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. భగవంతుడు ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిపించాలని కోరుకున్నారు. అనంతరం రామచంద్రపురం బీహెచ్‌ఈఎల్ రిటైర్డ్ ఎంప్లాయ్ బాలరాజు భార్య మంజుల ప్రమాదవశాత్తు మృతి చెందగా.. మెడికవర్ హాస్పిటల్ లో మృతదేహం వద్ద నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీతో పాటు బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, బీజేపీ నాయకులు వెంకట నర్సింహా రెడ్డి, పోచారం రాములు తదితరులు ఉన్నారు.

# డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు

అఖండ సూర్య సంగారెడ్డి

సదాశివపేట: గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ సదాశివపేటలో 2026-27 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి DOST (Degree Online Services Telangana) ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రథమ ఎంపికగా గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ సదాశివపేటను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ఈ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు: BA, BCom (Computers), BSc (MPC), BSc (BZC), BBA, BCom (BFSIADEP), BSc (MSCS), BSc (Horticulture and Landscaping), BSc (Pharmaceutical Manufacturing, Analysis & Quality Control) మొదలైనవి.

ఈ కోర్సుల ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులు చదువుకుంటూనే ఉపాధి అవకాశాలు పొందే విధంగా రూపకల్పన చేయడం. అకాడమిక్ విద్యను పరిశ్రమలతో అనుసంధానం చేసి ఈ కోర్సులను రూపొందించారు. ఈ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు స్టైపెండ్ కూడా అందించబడుతుంది. కోర్సు పూర్తయిన తర్వాత అదే సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి.

ప్రస్తుతం DOST ప్రక్రియ కొనసాగుతోంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మంచి పాస్ శాతం ఉన్న ఈ కళాశాలను ఫస్ట్



ఆప్షన్‌గా ఎంపిక చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. కళాశాలలో విశాలమైన తరగతి గదులు, సువిశాల క్రీడామైదానం, పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం, రోడ్డు సౌకర్యం, బస్సు పాస్ సదుపాయం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యార్థులు తమ చదువును కొనసాగించవచ్చు. అందువల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు కళాశాలను సందర్శించి, అందుబాటులో ఉన్న కోర్సుల్లో తమ పిల్లలను చేర్పించాలని ప్రిన్సిపల్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# దక్షిణాదిపై వివక్ష..

మొదటిపేజీ తరువాయి

ఎప్పుడూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తమిళనాడులో బీజేపీకి అసలు ఉనికే లేదని, ఆ పార్టీకి ఓటు వేయవద్దని కోరారు. ఢిల్లీ లిక్కర్ కేసు విచారణ చేస్తున్న జస్టిస్ స్వర్ణ కాంత శర్మను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. దీనిపై స్పందిస్తూ... ప్రస్తుతం తాను తమిళనాడు ప్రచారంలో ఉన్నానని, ఢిల్లీకి తిరిగి వెళ్లాక కోర్టు ఉత్తర్వులను క్షుణ్ణంగా చదువుతానని చెప్పారు. ఇప్పటికే తన వాదనలను కోర్టులో వినిపించానని, తీర్పుపై అంతకుమించి వ్యాఖ్యానించలేనని పేర్కొన్నారు.



# కోపాన్ని ఇలా కంట్రోల్ చేసుకోండి..



కోపం ప్రతి మనిషిలోనూ కనిపించే భావోద్వేగమే. అయితే కొందరికి అప్పడప్పుడూ కోపం వస్తుంది.. కొందరికి అసలే రాదు.. మరికొందరికి మాత్రం చిటికిమాటికి కోపం వస్తుంది. ఇలా చీటిమాటికి కోపం రావడం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయి. కొంతమంది కోపంలో ఏవేవో మాటలు అనేసి ఆ తర్వాత బాధపడుతూ ఉంటారు. తమ కోపాన్ని ఎలా కంట్రోల్ చేసుకోవాలో తెలియదు. బాగా కోపం వచ్చినప్పుడు.. తరుచూ కోపం వస్తుంటే ఈ టిప్స్ పాటించి కోపం కంట్రోల్ చేసుకోండి. కోపాన్ని కంట్రోల్ చేసుకోవడానికి బ్రీథింగ్ వర్కౌట్స్ చేయడం వల్ల చాలా వరకు కోపం కంట్రోల్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

### నవ్వడం..

**బాధ, చిరాకు కలిగించే విషయాలు మనకి కోపాన్ని తెప్పిస్తాయి. కాబట్టి, వాటిని హాస్యంతో దూరం చేయండి. నవ్వండి, నవ్వుతూ ఉండండి. అలాంటి వీడియోలు చూడండి. ఆల్‌గుడ్, టేక్ ఇట్ ఈజీ వంటి వర్డ్స్‌ని ఒకటికి రెండు సార్లు గట్టిగా చెప్పండి. లేదా సైలెంట్‌గా సాంగ్స్ వింటూ ఎంజాయ్ చేయండి. దీని వల్ల చాలా వరకూ మనసు రిలాక్స్ అవుతుంది.**



### ఆలోచించి మాట్లాడడం..

కోపంలో మాట్లాడే విషయాలు తర్వాత పెద్ద నష్టానికి దారితీస్తాయి. కాబట్టి, ఏదైనా చేసేముందు ఆలోచించి నిర్ణయం తీసుకోండి. కోపంలో తప్పులు చేయడం, మాట్లాడడం మానుకోండి. కోపం తర్వాత వచ్చే సమస్యల గురించి ఆలోచిస్తే ముందే కోప్పడకుండా ఉంటారు. సరిగ్గా ఆలోచించాక మీ బాధ గురించి తెలియజేయండి. దీని వల్ల ఎవరికీ ఏం నష్టం జరగకుండా ఉంటుంది. కాబట్టి, ముందే మీ బాధని తెలియజేయండి. కోపంలో చాలా మంది ఇతతరులను తిట్టడం, బూతులు మాట్లాడడం చేస్తుంటారు. అలా చేయడం వల్ల ఆ మాటలు తర్వాత చాలా బాధపెడతాయి. అలా కాకుండా మీకు ఏం అనిపిస్తుందో అది చెప్పే ప్రయత్నం చేయండి. దాని గురించి మీ వివరించి సైలెంట్‌గా ఉండండి.

### వేరే విషయాల గురించి..

కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే మీ మనసు, శరీరానికి రెస్ట్‌ని ఇవ్వండి. నిద్రపోవడం, మ్యూజిక్ వినడం వంటి వాటి గురించి ఆలోచించండి. కోపం రావడానికి కారణం, పరిస్థితులని మర్చిపోయి సమస్యని పరిష్కరించేందుకు ప్రయత్నించండి. కోపం ప్రతీదానికి పరిష్కారం కాదని, అది పరిస్థితిని దిగజార్చుతుందని గుర్తుంచుకోండి.



# రైస్‌వాటర్ ఫేస్ ప్యాక్ తో అద్భుతాలు



రైస్ వాటర్ ఇప్పుడు చాలా సౌందర్య లేపనాల్లో వాడుతున్నారు. పులియబెట్టిన రైస్ వాటర్.. చర్మానికి మంచి మెరుపును ఇస్తుంది. తేమను కాపాడుకోవడానికి కూడా ఈ ప్యాక్ ఉపయోగపడుతుంది.

### ఎలా చేయాలి?

**ముందుగా ఓ కప్పు బియ్యాన్ని తీసుకుని కడిగి మంచి నీటిలో 30 నిమిషాలు నానబెట్టి ఆ నీటిని వడకట్టి రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు మీ స్కిన్, జుట్టుకి అప్లై చేయొచ్చు.**

### టోనర్‌గా..

**ఈ వాటర్‌ని స్ప్రే బాటిల్‌లో వేసుకుని చర్మంపై స్ప్రేలా వాడొచ్చు. ఇందులో దోసకాయ రసాన్ని కలిపితే చర్మానికి హైడ్రేషన్ అందించినవారవుతాం.**

### ఫేస్‌ప్యాక్..

బియ్యం కడిగిన నీటిలో కొద్దిగా అలోవెరా జెల్, అరచెంచా నిమ్మరసం మిక్స్ చేసి పేస్టులా చేసి చర్మానికి అప్లై చేసి మసాజ్ చేయాలి. బెస్ట్ రిజల్ట్స్ కోసం వారానికి రెండు, మూడుసార్లు అప్లై చేయండి.









### సూర్య కిరణాల నుండి..

ఎండాకాలంలో పెరిగిన ఎండల కారణంగా చర్మ సమస్యలు వస్తాయి. వీటి నుంచి మన చర్మాన్ని కాపాడుకోవాలంటే ఈ బియ్యం నీరు మనకి హెల్ప్ చేస్తుంది. ఇది స్కిన్ కొల్లాజెన్‌ని మెరుగుపరిచి, ముడతల్ని పోగొడుతుంది. కాబట్టి, దీనిని హ్యాపీగా వాడుకోవచ్చు.

### హెయిర్ ఫాల్ తగ్గించే.. రైస్ హెయిర్ మాస్క్

పొడి చర్మం అనేది చాలా మందిని ఇబ్బందిపెట్టే సమస్య. ఈ నీటిని వాడడం వల్ల చర్మంలో తేమ అలానే ఉండి చర్మం పొడిబారకుండా ఉంటుంది. అదే విధంగా, ఇందులోని అమైనా యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. రైస్ వాటర్ వాడడం వల్ల చర్మ స్థితిస్థాపకత మెరుగవుతుంది. దీని వల్ల చర్మంపై గీతలు, ముడతలు తగ్గి స్కిన్ అందంగా మారుతుంది.







### చర్మ సమస్యలకి..

చర్మ సౌందర్యాన్ని కాపాడడంలో బియ్యం నీరు ముందుంటుంది. దీనిని వాడడం వల్ల తామర, మొటిమలు, మచ్చలు, దురద వంటి సమస్యలు తగ్గి చర్మం మెరుగవుతుంది. అంతేకాకుండా ఈ నీటిని వాడడం వల్ల ముఖంపై జిడ్డు తగ్గుతుంది. చర్మ సమస్యలకి ముఖ్య కారణం జిడ్డు కారణం. ఈ నీటిని వాడడం వల్ల జిడ్డు దూరమై సమస్యలన్నింటికీ చెక్ పెట్టొచ్చు.

# ఢిల్లీలో అమెజాన్ డెలివరీ ఫ్రాడ్ గుట్టురట్టు

- ఢిల్లీలో అమెజాన్ ఆన్‌లైన్ డెలివరీలో భారీ మోసం
- రూ. 35 లక్షల విలువైన 50 ఐఫోన్ల ఆర్డర్ మాయం
- డెలివరీ ఏజెంట్‌తో సహా ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- నిందితుల నుంచి రూ. 10 లక్షల విలువైన 14 ఐఫోన్లు స్వాధీనం
- సులభంగా డబ్బు సంపాదించేందుకే ఈ నేరం చేసినట్లు వెల్లడి

**అఖండ సూర్య :**

ప్రముఖ ఈకామర్స్ సంస్థ అమెజాన్‌తో ముడిపడిన భారీ ఆన్‌లైన్ డెలివరీ మోసాన్ని ఢిల్లీ పోలీసులు ఛేదించారు. సుమారు రూ. 35 లక్షల విలువైన ఖరీదైన వస్తువులను పక్కదారి పట్టించిన ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 10 లక్షల విలువైన 14 సీల్డ్ ఐఫోన్ 16 యూనిట్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు.

వివరాల్లోకి వెళితే, ఢిల్లీలోని శాస్త్రి నగర్‌కు చెందిన సుమిత్ అగర్వాల్ అనే వ్యక్తి ఏప్రిల్ 12 నుంచి 16 మధ్య అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లో 50 ఐఫోన్ 16 (128 GB) ఫోన్లను ఆర్డర్ చేశారు. అయితే, అమెజాన్ యాప్‌లో అన్ని ఆర్డర్లు "డెలివరీ" అయినట్లు చూపించినప్పటికీ, తనకు ఒక్క వస్తువు కూడా అందలేదని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని మొత్తం విలువ సుమారు రూ. 35 లక్షలు ఉంటుందని అంచనా.

ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన భరత్ నగర్ పోలీసులు, దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. డెలివరీ ఏజెంట్లే తమ సహచరులతో కుమ్మక్కై ఈ మోసానికి పాల్పడి ఉంటారని అనుమానించారు. దర్యాప్తులో భాగంగా, అమెజాన్ డెలివరీ ఏజెంట్ అయిన జస్‌ప్రీత్ సింగ్ (21) పనేనని గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో జస్‌ప్రీత్ నేరాన్ని అంగీకరించాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు తన స్నేహితుడు హిమాన్షు (30)తో కలిసి ఈ మోసానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు హిమాన్షును కూడా అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 10 లక్షల విలువైన 14 ఐఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ మొదటిసారి నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన ఫోన్ల రికవరీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.




# ఉదయనిధి అఫిడవిట్‌లో లెక్కల తారుమారు.. ఐటీ శాఖ సంచలన ఆరోపణలు!

- 2021, 2026 ఎన్నికల అఫిడవిట్ల మధ్య తేడాలు ఉన్నాయని హైకోర్టుకు తెలిపిన ఐటీ శాఖ
- బ్యాంకు రుణాల విషయంలో కూడా తేడాలను గుర్తించిన అధికారులు
- ఐటీఆర్-2 కింద మళ్లీ రిటర్న్స్ ఫైల్ చేయాలని సూచన

**అఖండ సూర్య :**

తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్లలోని గణాంకాలపై ఆదాయ పన్ను శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 2021 అఫిడవిట్ కు, 2026 ఎన్నికల అఫిడవిట్ కు మధ్య తేడాలు ఉన్నాయని మద్రాస్ హైకోర్టుకు ఐటీ శాఖ తెలిపింది.

2021 అఫిడవిట్‌లో రెడ్ జెయింట్ మూవీస్‌లో రూ. 7.36 కోట్ల పెట్టుబడి ఉన్నట్లు చూపిన ఉదయనిధి, 2026 అఫిడవిట్‌లో ఆ ప్రస్తావనే చేయలేదు. అదే సంస్థలో ఆయన భార్య పేరిట రూ. 2.63 కోట్ల పెట్టుబడులు ఉన్నట్టు ప్రస్తుత అఫిడవిట్లో చూపించారని... ఈ పెట్టుబడులను 2021 అఫిడవిట్లో ప్రస్తావించలేదని ఐటీ శాఖ పేర్కొంది.

2021లో రూ. 11.06 కోట్లు, 2026లో రూ. 10 కోట్ల బ్యాంకు రుణం ఉన్నట్లు అఫిడవిట్లలో పేర్కొన్నారు. కానీ కంపెనీ రికార్డుల ప్రకారం అది రూ. 18 కోట్లుగా ఉందని ఐటీ శాఖ వెల్లడించింది. తాజా అఫిడవిట్ ప్రకారం ఉదయనిధి ఆస్తుల విలువ రూ. 20.6 కోట్లు (రూ. 12.9 కోట్ల చరాస్తులు, రూ. 7.7 కోట్ల స్థిరాస్తులు). అయితే ఈ గణాంకాలన్నీ గందరగోళంగా ఉన్నాయని, ఐటీఆర్2 ఫార్మాట్ కింద మళ్లీ ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలని ఐటీ శాఖ సూచించింది. చెన్నై నివాసి ఆర్. కుమారవేల్ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ విచారణ జరుగుతోంది. ఉదయనిధి 202425 వార్షిక ఆదాయం రూ. 10 లక్షలుగా చూపగా, ఆయన భార్య ఆదాయం రూ. 2.9 కోట్లుగా ఉండటం కూడా చర్చనీయాంశమైంది.



# 149 ఏళ్ల తర్వాత "మెగా ఎల్ నినో".. భారత్‌లో కరువు తప్పదా..?

**అఖండ సూర్య :**

భారత్‌లో ''కరువు'' పరిస్థితులు రాబోతున్నాయా..?, ''మెగా ఎల్ నినో'' ఏర్పడబోతోందా? అంటే ఔననే సమాధానాలే వినిపిస్తున్నాయి. 1877 తర్వాత అత్యంత శక్తివంతమైన ఎల్ నినో పరిస్థితులు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఆ సమయంలో ప్రపంచ జనాభాలో 4 శాతం జనాభాను ఈ ఎల్ నినో బలితీసుకుంది. ఇప్పుడు 2026లో ఇది మళ్లీ ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎల్ నినో సహజ వాతావరణ సంఘటన. దీని వల్ల పసిఫిక్ మహా సముద్రంలో జలాలు వేడెక్కుతాయి. దీని వల్ల రుతుపవనాలు ఆ ప్రాంతానికి వెళ్లి వర్షిస్తాయి. దీని వల్ల భారత ఉపఖండంతో పాటు, ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా దేశాల్లో తీవ్ర వర్షాల లోటు ఏర్పడుతుంది. సాధారణంగా ఎల్ నినో ప్రతీ 27 సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. కానీ ఈసారి ఇది మరింత తీవ్రంగా ఉంది. వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్న దాని ప్రకారం.. పెరిగిన వేడి, తేమ కారణంగా పాశ్చాత్య దేశాల్లో వడగాలుల ప్రభావం తీవ్ర కావచ్చని, ఇది గత 140 ఏళ్లతో పోలిస్తే తీవ్రంగా ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు.

మైక్రోనేషియాలో మొదలైన ఒక వేడిగాలి తరంగం ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో 8,046 కిలోమీటర్ల మేర కాలిఫోర్నియా వరకు వ్యాపించి ఉంది. కాలిఫోర్నియా సమీపంలో దీనిని "ది బ్లాబ్" అని పిలుస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. ఈ వేడితరంగాలు ఎల్ నినోను మరింత బలపరుస్తోంది. ఇది మొత్తం ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది.

**1877 తర్వాత, ప్రమాదకరంగా 2026:**

187778 లో ఏర్పడిన ఎల్ నినో చరిత్రలోనే అత్యంత విధ్వంసమైందిగా పేర్కొంటారు. ఇది వడగాలులు, కరువు, పంట నష్టానికి దారి తీసి, లక్షలాది మంది ప్రాణాలను తీసుకుంది. ఇప్పుడు, 2026లో ఏర్పడబోయే ఎల్ నినో మరింత తీవ్రంగా ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ మెగా ఎల్ నినో సంభవిస్తే 2027లో ప్రపంచ ఉష్ణోగ్రతలు రికార్డ్ స్థాయిలో నమోదు అవుతాయి.

దీని వల్ల ఆస్ట్రేలియా, దక్షిణ, మధ్య ఆఫ్రికా, భారత్, అమెజాన్ వర్షారణ్యాల్లో వర్షాలు తగ్గుతాయి. కరువు, తీవ్రమైన వేడి పెరుగుతుంది. అగ్ని ప్రమాదాల ముప్పు పెరుగుతుంది. మరోవైపు, యూఎస్‌లో ముఖ్యంగా దక్షిణ యూస్‌లో భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చు. ఉత్తర అమెరికా ప్రాంతంలో మాత్రం వేడి పెరుగుతుంది. ఆసియా, ఆఫ్రికా లోని అనేక దేశాల్లో




పంటలు తీవ్రంగా ప్రభావితం అవుతాయి.

**భారత్‌పై తీవ్ర ప్రభావం:**

ఈ సూపర్ ఎల్ నినో వల్ల రుతుపవనాలపై ఆధారపడిన భారత్ తీవ్రంగా ప్రభావం అవుతుంది. 2026 వేసవిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగాయి. ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తర భారతదేశంలో ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతాయి. జూన్‌సెప్టెంబర్ రుతపవనాలు బలహీనపడవచ్చు, దీనివల్ల కరువు ప్రమాదం పెరుగుతుంది. వాయువ్య భారతదేశంలో కరువు పరిస్థితులు ఏర్పడవచ్చు. వ్యవసాయం ప్రభావితమవుతుంది . ఈ వేసవిలో అధిక తేమ వల్ల ఉక్కపోత ఉంటుంది. ఒకవేళ ఎల్ నినో అత్యంత తీవ్రరూపం దాల్చితే, దాని ప్రభావం 2027 వరకు కొనసాగుతుంది.

# భారత్‌లో ఇంధన విప్లవం.. ఇక పెట్రోల్ కాదు, ఆల్కహాల్‌తో వాహనాల పరుగులు!




**అఖండ సూర్య :**

భారత్‌లో కొత్త విప్లవం రాబోతోంది. గల్ఫ్, ఇతర దేశాల నుంచి పెట్రోలియం దిగుమతులు చేసుకోవడం తగ్గనుంది. ఎందుకంటే ఇక నుంచి భారత్‌లో వాహనాలు త్వరలోనే ప్రధానంగా ఆల్కహాల్‌తో కూడిన ఇంధనంతో నడవవచ్చు. ఆల్కాహాల్‌తో కూడిన ఇంధనం అంటే ఏంటి? అనే సందేహం వచ్చిందా? ఇంధనంలో 85% వరకు ఇథనాల్, 15% పెట్రోల్ మిశ్రమంతో కూడిన E85 ఇంధనం అందుబాటులోకి రానుంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపే 'E20' ఇంధనం ఇప్పటికే అందుబాటులోకి రాగా, ఇప్పుడు ఏకంగా 85 శాతం ఇథనాల్‌తో నడిచే 'E85' (ఫ్లెక్స్ ఫ్యూయల్) దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించిన ముసాయిదా నిబంధనలను (Draft Rules) కేంద్ర ప్రభుత్వం అతి త్వరలోనే విడుదల చేయనుంది. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం, చమురు సంక్షోభం నేపథ్యంలో ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవడమే లక్ష్యంగా భారత్ ఈ నిర్ణయం తీసుకుంది.

జాతీయ మీడియా కథనాల సమాచారం ప్రకారం.. E85 అమలుపై ఇప్పటికే మార్కెట్ వర్గాలతో ఏకాభిప్రాయం కుదిరింది. వాహనాలపై ప్రాథమిక పరీక్షలు సైతం పూర్తయ్యాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న E20 పెట్రోల్‌కు ఇది అదనంగా, ఒక ప్రత్యేక గ్రేడ్ ఇంధనంగా లభిస్తుంది. అయితే, ఈ ఇంధనాన్ని వాడాలంటే సాధారణ ఇంజన్లు సరిపోవు. 'ఫ్లెక్స్ ఫ్యూయల్ వెహికల్స్' (FFVs) గా పిలిచే ప్రత్యేక ఇంజన్లను వాహన తయారీదారులు రూపొందించాల్సి ఉంటుంది. సాధారణ ఇంజన్లలో E85 ఇంధనాన్ని వాడితే సీల్స్, హోస్ పైపులు దెబ్బతినడమే కాకుండా, పనితీరు మందగించడం, తుప్పు పట్టడం వంటి సమస్యలు వస్తాయి. అందుకే ప్రత్యేకంగా రూపొందించిన ఇంజన్లు మాత్రమే ఈ అధిక ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకోగలవు. విశేషమేమిటంటే, E85 కోసం తయారు చేసిన ఇంజన్లు అవసరమైతే తక్కువ ఇథనాల్ ఉండే E50 లేదా E20 పెట్రోల్‌తో కూడా సురక్షితంగా నడుస్తాయి.

# "రాజకీయాల్లోకి రావాలంటే బెడ్రూంలోకి వెళ్లాల్సిందే"..

**అఖండ సూర్య :**

బీహార్ పూర్నియా ఎంపీ పప్పు యాదవ్ మహిళల రాజకీయ ప్రవేశం గురించి చేసిన అభ్యకరమైన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యాఖ్యల వైరల్ కావడంతో బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రాజకీయాల్లో మహిళల దోపిడి గురించి మాట్లాడుతూ.. ''ఏ రాజకీయ నాయకుడి గదికి వెళ్లకుండా 90 శాతం మంది మహిళలు తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించలేరు'' అని వ్యాఖ్యానించడం దుమారానికి కారణమైంది.

''గృహహింసకు పాల్పడుతున్నది ఎవరు? అమెరికా నుంచి భారత్ వరకు మహిళల్ని వేటాడుతున్నది ఎవరు? రాజకీయ నాయకులే. ఏ పురుష రాజకీయ నాయకుడి గదికి వెళ్లకుండా 90 శాతం మహిళలు రాజకీయాల్లోకి రాలేరు'' అని పప్పు యాదవ్ అన్నారు. మహిళల్ని దోపిడీ చేసే సంస్కృతి మన వ్యవస్థలో పాతుకుపోయిందని ఆయన అన్నారు. నాయకుడు మహిళల పట్ల రాబందుల్లా ప్రవర్తిస్తున్నారని, 70 శాతం మంది నాయకులు అశ్లీల చిత్రాలను చూస్తుంటారని, వారు వారి ఫోన్లను చెక్ చేసుకోండి అని అన్నారు. అణగారిన కులాల మహిళలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం లేదని చెప్పారు.

ఇదిలా ఉంటే, పప్పు యాదవ్ వ్యాఖ్యలపై బీహార్ ప్రభుత్వం సీరియస్ అయింది. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని బీహార్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.



# ఎయిరిండియా విమాన ప్రమాదంలో భార్యాబిడ్డలను కోల్పోయాడు.. ఇప్పుడు బ్రిటన్ ప్రభుత్వం పొమ్మంటోంది!

- విమాన ప్రమాదంలో భార్యాబిడ్డలను కోల్పోయిన భారతీయుడు
- యూకే నుంచి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్న సేర్‌వాలా
- మానవతా దృక్పథంతో చేసిన అభ్యర్థనను తిరస్కరించిన హోం ఆఫీస్
- ఇండియాకు వెళ్లలేనని, ఇక్కడే జీవితం మొదలుపెడతానని ఆవేదన

**అఖండ సూర్య :**

ఎయిరిండియా ఘోర విమాన ప్రమాదంలో భార్య, కన్నబిడ్డను కోల్పోయిన తీవ్ర విషాదం నుంచి ఇంకా కోలుకోకముందే, భారత సంతతికి చెందిన ఓ యువకుడికి మరో ఎదురుదెబ్బ తగిలింది. మహమ్మద్‌మియా సేర్‌వాలా (28) అనే ఆ యువకుడిని దేశం విడిచి వెళ్లాలంటూ యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయన జీవితం అగమ్యగోచరంగా మారింది.

వివరాల్లోకి వెళితే, 2025 జూన్ 12న అహమ్మదాబాద్ నుంచి లండన్ వెళుతున్న ఎయిరిండియా ఫ్లైట్ 171 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. ఈ దుర్ఘటనలో సేర్‌వాలా భార్య సదీఖా, వారి రెండేళ్ల కుమార్తె ఫాతిమా సహా మొత్తం 241 మంది ప్రాణాలు కోల్పోయారు. గుజరాత్‌లోని వడోదరకు చెందిన సేర్‌వాలా... తన భార్య డిపెండెంట్ వీసాపై 2022లో యూకే వచ్చారు. ప్రమాదం తర్వాత తీవ్ర మానసిక వేదనకు గురైన ఆయన, లండన్‌లోని బంధువుల సాయంతో జీవితాన్ని తిరిగి గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

అయితే, ఆయన డిపెండెంట్ వీసా గడువు 2026 ప్రారంభంలో ముగిసింది. తన విషాదకర పరిస్థితిని వివరిస్తూ, మానవతా దృక్పథంతో యూకేలోనే ఉండేందుకు అనుమతించాలని ఆయన చేసుకున్న అభ్యర్థనను ఏప్రిల్ 9న హోం ఆఫీస్ తిరస్కరించింది. ఏప్రిల్ 22లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది.



"నాకు ఇక ఏమీ మిగలలేదు. ఇండియాకు తిరిగి వెళితే ఆ బాధాకరమైన జ్ఞాపకాల నుంచి బయటపడలేను. ఇక్కడే నా జీవితాన్ని మళ్లీ ప్రారంభించాలనుకుంటున్నాను" అని సేర్‌వాలా కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం ఆయన న్యాయవాదులు హోం ఆఫీస్ నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంపై వలసదారుల హక్కుల సంఘాలు స్పందిస్తూ, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరుతున్నాయి. అయితే, అన్ని దరఖాస్తులను నిబంధనల ప్రకారమే పరిశీలిస్తామని హోం ఆఫీస్ వర్గాలు స్పష్టం చేశాయి.

# టీ20 ప్రపంచకప్‌లో ఫిక్సింగ్ కలకలం.. కెనడా క్రికెట్‌లో బిష్ణోయ్ గ్యాంగ్!

- టీ20 ప్రపంచకప్‌లో కెనడా జట్టు మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు
- కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వాపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం విచారణ
- బజ్వాను కెప్టెన్‌గా నియమించడం వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం
- ఆటగాళ్లను బెదిరించి కెప్టెన్సీ ఇప్పించినట్లు సంచలన కథనం
- ఈ కుంభకోణంలో కెనడా క్రికెట్ ప్రెసిడెంట్ పాత్రపైనా అనుమానాలు

**అఖండ సూర్య :**

ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో పెను సంచలనం రేగింది. కెనడా క్రికెట్ జట్టులో మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణం బయటపడటంతో ఐసీసీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ స్కాండల్ వెనుక సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య కేసులో నిందితుడిగా ఉన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు వెలుగులోకి రావడం క్రీడా ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కెనడా కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా ప్రమేయంపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) విచారణ జరుపుతోంది. కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (సీబీసీ) ప్రచురించిన ఒక కథనం ప్రకారం ఈ ఫిక్సింగ్ వ్యవహారంలో బిష్ణోయ్ గ్యాంగ్ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. న్యూజిలాండ్‌తో జరిగిన గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో దిల్‌ప్రీత్ బజ్వా అసాధారణంగా, ఖరీదైన ఓవర్ వేయడంతో అతనిపై అనుమానాలు మొదలయ్యాయి. దీంతో ఏసీయూ అధికారులు బజ్వాను ప్రశ్నించి, అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

టీ20 ప్రపంచకప్‌కు కొన్ని వారాల ముందు బజ్వాను కెప్టెన్‌గా నియమించడం వెనుక పెద్ద కుట్రే జరిగిందని సీబీసీ కథనం పేర్కొంది. 2025 జులైలో కొందరు ఆటగాళ్లను బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు బెదిరించి, బజ్వాకు మద్దతివ్వాలని ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. "బజ్వా ప్రమోషన్‌కు మద్దతివ్వకపోతే, నీకు, నీ కుటుంబానికి తీవ్ర పరిణామాలు తప్పవు" అని ఓ



సీనియర్ ఆటగాడిని బెదిరించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకించిన 'నోవా' అనే మరో ఆటగాడికి భయానక ఫొటోతో కూడిన మెసేజ్ పంపి హెచ్చరించినట్లు సమాచారం.

డబ్బు సంపాదించడానికే మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు బజ్వాను కెప్టెన్‌గా నియమించారని 'నోవా' ఆరోపించారు. ఈ వ్యవహారంలో కెనడా క్రికెట్ ప్రస్తుత అధ్యక్షుడు అర్వీందర్ ఖోసా పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బజ్వాను కెప్టెన్‌గా ప్రతిపాదించిన వారిలో ఖోసా కూడా ఉన్నారని, అయితే ఆయన ఈ ఆరోపణలను ఖండిస్తూ తనపై రాజకీయ కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. కెనడా ప్రభుత్వం ఇప్పటికే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ముఠా ఏకంగా ఒక జాతీయ జట్టులోకి చొరబడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

## చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో ఎదురుదెబ్బ.. ఐపీఎల్ నుంచి ఆయుష్ మాత్రే ఔట్

- సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో మాత్రే ఎడమ కాలికి గాయం
- కోలుకోవడానికి 6 నుంచి 12 వారాల సమయం పడుతుందని ఫ్రాంచైజీ ప్రకటన
- ఇప్పటికే టోర్నీకి దూరమైన బౌలర్లు ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్
- గురువారం ముంబై ఇండియన్స్‌తో తలపడనున్న చెన్నై సూపర్ కింగ్స్

**అఖండ సూర్య :**

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టుకు ఐపీఎల్ 2026లో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు యువ టాప్ ఆర్డర్ బ్యాటర్ ఆయుష్ మాత్రే ఎడమ కాలి గాయం (హామ్‌స్ట్రింగ్) కారణంగా టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఇవాళ సీఎస్కే ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా అతనికి ఈ గాయమైంది.

ఆయుష్ మాత్రే గాయం నుంచి కోలుకుని మళ్లీ మైదానంలో అడుగుపెట్టడానికి 6 నుంచి 12 వారాల విశ్రాంతి అవసరమని ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో తెలిపింది. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో 195 పరుగుల ఛేదనలో గుర్‌జపనీత్ సింగ్ స్థానంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన ఈ 18 ఏళ్ల కుర్రాడు అద్భుతంగా ఆడాడు. కేవలం 12 బంతుల్లోనే 30 పరుగులు చేసి జోరుమీద కనిపించాడు. అయితే, ఐదో ఓవర్‌లో రెండో పరుగు తీసే ప్రయత్నంలో అతనికి గాయమైంది. నొప్పితో బాధపడుతూనే బ్యాటింగ్ కొనసాగించిన అతడు కాసేపటికే తన వికెట్ కోల్పోయాడు.

ఈ గాయంపై సీఎస్కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ స్పందిస్తూ.. "ఇది హామ్‌స్ట్రింగ్ టియర్. గాయం తీవ్రత ఎలా ఉందో కచ్చితంగా తెలియదు కానీ, చూస్తుంటే పరిస్థితి కాస్త గట్టిగానే ఉన్నట్లు అనిపిస్తోంది. మంచి ఫామ్‌లో ఉన్న ఆయుష్ దూరం కావడం జట్టుకు పెద్ద లోటే. యువ ప్రతిభావంతుడు అయిన అతడు దూరం కావడం నిరాశ కలిగించినా.. బెంచ్‌పై అవకాశం కోసం ఎదురుచూస్తున్న మరో మంచి ఆటగాడికి ఇప్పుడు ఛాన్స్ దక్కుతుంది" అని వివరించాడు.

ఈ సీజన్‌లో సీఎస్కే నుంచి గాయంతో తప్పుకున్న మూడో ఆటగాడు ఆయుష్ మాత్రే. ఇప్పటికే బౌలర్లు ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్ టోర్నీకి దూరమయ్యారు. మరోవైపు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కూడా ప్రాక్టీస్ సెషన్‌లో తగిలిన కాలి గాయం నుంచి ఇంకా కోలుకుంటున్నాడు. దీంతో అతడు ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. సన్‌రైజర్స్‌పై 10 పరుగుల తేడాతో ఓడిన చెన్నై.. ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో 4 పాయింట్లతో పట్టికలో ఏడో స్థానానికి పడిపోయింది. గురువారం నాడు ముంబై ఇండియన్స్‌తో సీఎస్కే తన తదుపరి మ్యాచ్ ఆడనుంది.



## వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మహాత్రే కంటే ఆ కుర్రాడు చాలా గ్రేట్"..

**అఖండ సూర్య :**

గత వారం లక్నో సూపర్ జెయింట్స్ (LSG) జట్టుపై పంజాబ్ కింగ్స్ (PBKS) బ్యాటర్ ప్రియాన్ష్ ఆర్య 37 బంతుల్లో 93 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. గతేడాదిలో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఈ 24 ఏళ్ల ఆటగాడు, అప్పుడే 475 పరుగులు సాధించి తన రాకను చాటుకున్నాడు. ఆదివారం లక్నోపై ప్రియాన్ష్ ఆడిన ఇన్నింగ్స్ అనంతరం.. టీమిండియా మాజీ వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ప్రియాంశ్ ఆర్యను ఆకాశానికెత్తేశాడు. ప్రస్తుత ఐపీఎల్‌లో అదరగొడుతున్న కుర్రాళ్లు ఆయుష్ మ్హాత్రే, వైభవ్ సూర్యవంశీ కంటే ప్రియాంశ్ ఒక అడుగు ముందే ఉన్నాడని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. “నేను ఎవరినీ తక్కువ చేసి మాట్లాడటం లేదు కానీ, ప్రియాంశ్ ఆర్య ఆడే తీరు అద్భుతం. అతని వద్ద షాట్ల రేంజ్ ఎక్కువగా ఉంది. పెద్ద స్కోర్లు సాధించడంలో అతను మిగిలిన యువ ఆటగాళ్ల కంటే కాస్త మెరుగ్గా కనిపిస్తున్నాడు” అని అశ్విన్ ప్రశంసించాడు.

ఈ సీజన్‌లో ప్రియాంశ్ ఆర్య గణాంకాలను పరిశీలిస్తే... 5 మ్యాచ్‌ల్లో 211 పరుగులు చేశాడు. సగటు (Average) 42.2గా ఉంది. 248 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్ తో కొనసాగుతున్నాడు. 11 బంతుల్లో 39, 20 బంతుల్లో 57, 37 బంతుల్లో 93 పరుగులు వంటి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు, ఇతర యువ ఆటగాళ్ల విషయానికొస్తే.. చెన్నై సూపర్ కింగ్స్ (CSK) తరపున అద్భుతంగా ఆడుతున్న ఆయుష్ మ్హాత్రే దురదృష్టవశాత్తూ గాయపడ్డాడు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా అతను ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఆయుష్ 6 ఇన్నింగ్స్‌ల్లో 33.50 సగటుతో 201 పరుగులు చేశాడు. ఇకపోతే, రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న మరో యువ కెరటం వైభవ్ సూర్యవంశీ కూడా పరుగుల వేటలో దూసుకుపోతున్నాడు. వైభవ్ ఇప్పటివరకు 6 మ్యాచ్‌ల్లో 246 పరుగులు సాధించి టోర్నమెంట్‌లో టాప్ పర్ఫార్మర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. ఇక.. నిలకడ, భారీ స్కోర్లు చేసే సత్తా, అద్భుతమైన స్ట్రైక్ రేట్ ఉండటం వల్లే అశ్విన్ వంటి సీనియర్ ఆటగాళ్లు ప్రియాంశ్ ఆర్య భవిష్యత్తుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## కోహ్లీ వల్లే క్రికెట్ చూడటం మొదలుపెట్టా.. మేమిద్దరం టచ్‌లోనే ఉంటాం.. త్వరలో భారత్‌కు వస్తా

- విరాట్ కోహ్లీ వల్లే తాను క్రికెట్‌ను ఇష్టపడటం ప్రారంభించానన్న జొకోవిచ్
- కోహ్లీ తనకు మంచి స్నేహితుడన్న టెన్నిస్ దిగ్గజం
- త్వరలోనే భారత్‌లో పర్యటించి కోహ్లీతో కలిసి టెన్నిస్, క్రికెట్ ఆడతానని ప్రకటన
- భారత అభిమానుల నుంచి లభిస్తున్న ప్రేమకు, మద్దతుకు జొకోవిచ్ కృతజ్ఞతలు

**అఖండ సూర్య :**

టెన్నిస్ ప్రపంచంలో తిరుగులేని రారాజుగా వెలుగొందుతున్న నోవాక్ జొకోవిచ్, టీమిండియా పరుగుల యంత్రం విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. అసలు తాను క్రికెట్ చూడటం ప్రారంభించడానికి కారణమే విరాట్ కోహ్లీ అని ఆయన వెల్లడించాడు. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహబంధం, పరస్పర గౌరవం మరోసారి క్రీడా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. లారియస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా జొకోవిచ్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

"విరాట్ కోహ్లీ నా మంచి స్నేహితుడు. నేను ఎంతో గౌరవించే, ఆరాధించే వ్యక్తి. నిజం చెప్పాలంటే, అతని వల్లే నేను క్రికెట్‌ను ఫాలో అవ్వడం మొదలుపెట్టాను. అంతకుముందు నాకు క్రికెట్‌పై పెద్దగా అవగాహన లేదు. మేమిద్దరం తరచూ టచ్‌లో ఉంటాం" అని జొకోవిచ్ తెలిపాడు. 'టైమ్స్ నౌ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు పంచుకున్నారు. "భవిష్యత్తులో నేను భారత్‌కు వచ్చినప్పుడు, అతను నాతో కలుస్తాడని ఆశిస్తున్నాను. ఇద్దరం కలిసి సరదాగా కాసేపు టెన్నిస్, మరికాసేపు క్రికెట్ ఆడతాం. క్రీడాస్ఫూర్తిని చాటుతూ మంచి సందేశాన్ని అందిస్తాం" అని తన కోరికను బయటపెట్టాడు.

ఈ సందర్భంగా భారత అభిమానులకు కూడా జొకోవిచ్ ఒక సందేశం పంపాడు. "గత కొన్నేళ్లుగా భారత క్రీడాభిమానుల నుంచి నాకు లభిస్తున్న ప్రేమ, మద్దతుకు నేను ఎంతో రుణపడి ఉంటాను. త్వరలోనే మిమ్మల్ని భారత్‌లో కలుస్తాను. గత రెండేళ్లుగా భారత్‌ను సందర్శించాలని నా మనసు బలంగా చెబుతోంది. అక్కడ ఒక ఈవెంట్ నిర్వహించడం లేదా ఒక మ్యాచ్ ఆడటం వంటివి చేయాలని ఉంది. భారత ప్రజలతో నాకు తెలియని ఒక అనుబంధం ఉంది" అని జొకోవిచ్ పేర్కొన్నాడు.

'బిగ్ 3' మధ్య ఉన్న పోటీనే ఎప్పటికీ గొప్పది

ఇదే సమయంలో టెన్నిస్‌లో యువ సంచలనాలు కార్లోస్ అల్కరాజ్, జానిక్ సిన్నర్‌లతో తన ప్రత్యర్థిత్వం గురించి కూడా జొకోవిచ్ మాట్లాడారు. సిన్నర్, అల్కరాజ్‌ల మధ్య పోటీ అద్భుతంగా ఉన్నప్పటికీ, తన దృష్టిలో టెన్నిస్‌లో 'బిగ్ 3' (ఫెదరర్, నాదల్, జొకోవిచ్) మధ్య ఉన్న పోటీనే ఎప్పటికీ గొప్పదేనని జొకోవిచ్ స్పష్టం చేశాడు.







## సెలబ్రిటీల క్లబ్‌లో చేరిన నితీశ్ రెడ్డి.. కొత్త రేంజ్ రోవర్ కారుతో హల్‌చల్

- కొత్త రేంజ్ రోవర్ లగ్జరీ కారు కొన్న సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి
- కుటుంబంతో కలిసి బాటూమీ గోల్డ్ రంగు కారులో చక్కర్లు
- ప్రముఖ బాలీవుడ్ తారలు వాడే కారును సొంతం చేసుకున్న యువ క్రికెటర్
- అత్యాధునిక ఫీచర్లు, శక్తిమంతమైన ఇంజిన్ ఈ కారు సొంతం

**అఖండ సూర్య :**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తరఫున అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, తన విజయానికి గుర్తుగా ఓ ఖరీదైన కారును సొంతం చేసుకున్నాడు. 22 ఏళ్ల ఈ యువ కెరటం, ప్రముఖ లగ్జరీ ఎస్‌యూవీ అయిన రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీని కొనుగోలు చేశాడు. ఈ కారుతో బాలీవుడ్ తారలు కంగనా రనౌత్, సంజయ్ దత్, శిల్పా శెట్టి, జాన్వీ కపూర్ వంటి ప్రముఖుల సరసన నిలిచాడు.

ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌పై హైదరాబాద్ 10 పరుగుల తేడాతో విజయం సాధించడంలో నితీశ్ రెడ్డి తన అద్భుత బౌలింగ్‌తో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈ విజయం తర్వాత అతను తన కుటుంబంతో కలిసి సరికొత్త రేంజ్ రోవర్ కారులో షికారు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బాటూమీ గోల్డ్ రంగులో మెరిసిపోతున్న ఈ ఎస్‌యూవీని డీలర్ నుంచి తీసుకుంటున్న దృశ్యాలు ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

**రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీ ప్రత్యేకతలు:**

నితీశ్ కొనుగోలు చేసిన ఈ లగ్జరీ కారులో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి. దీని టాప్ వేరియంట్‌లో 4.4లీటర్ వీ8 ఇంజిన్ అమర్చారు. ఇది 522 హార్స్‌పవర్ శక్తిని, 750 Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. మైల్డ్‌హైబ్రిడ్ టెక్నాలజీతో పనిచేసే ఈ కారు కేవలం 4.6 సెకన్లలోనే 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ఠ వేగం గంటకు 250 కిలోమీటర్లు. నితీశ్ రెడ్డి ఏ ఇంజిన్ వేరియంట్‌ను ఎంచుకున్నాడనే విషయంపై స్పష్టత లేదు.

ఇక, కారు లోపల సౌకర్యాలకు కొదవే లేదు. పవర్ అడ్జస్ట్‌మెంట్, మసాజ్ ఫంక్షన్లతో కూడిన సీట్లు, పీవీ ప్రో ఇన్ఫోటైన్‌మెంట్ కోసం కర్వ్డ్ టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో వంటి సదుపాయాలు ఉన్నాయి. మెరిడియన్ 29స్పీకర్ సరౌండ్ సౌండ్ సిస్టమ్, ఫోర్‌జోన్ క్లైమేట్ కంట్రోల్, వెనుక ప్రయాణికుల కోసం ఎగ్జిక్యూటివ్ క్లాస్ సీటింగ్ వంటివి ఇందులో ప్రధాన ఆకర్షణలు. భద్రత కోసం 360డిగ్రీ కెమెరా, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ (DSC), మల్టిపుల్ ఎయిర్‌బ్యాగ్స్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ADAS) వంటివి ఉన్నాయి. మైదానంలో తన ప్రతిభతో దూసుకుపోతున్న నితీశ్, ఇప్పుడు ఈ లగ్జరీ కారుతో తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు.



## ఉప్పల్ స్టేడియంలో నిమ్మకాయ మాయ.. నిజంగా మంత్రం వేశాడా?.. వైరల్ వీడియోపై క్లారిటీ ఇచ్చిన సతీష్!

- ఐపీఎల్ మ్యాచ్‌లో నిమ్మకాయతో మంత్రం వేస్తున్న వీడియో వైరల్
- శివమ్ దూబే బ్యాటింగ్ చేస్తుండగా ఘటన.. వెంటనే వికెట్
- వీడియోతో రాత్రికి రాత్రే ఫేమస్ అయిన యూట్యూబర్ సతీష్
- అది మ్యాజిక్ కాదని.. వీడియో కోసమే చేశానని క్లారిటీ

**అఖండ సూర్య :**

ఐపీఎల్ మ్యాచ్‌లు అంటేనే ఎన్నో ఆసక్తికర సంఘటనలకు వేదిక. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఓ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఓ యూట్యూబర్ నిమ్మకాయతో మంత్రం వేసినట్లు నటించడం, ఆ వెంటనే వికెట్ పడటంతో అతను రాత్రికి రాత్రే ఫేమస్ అయ్యాడు.

వివరాల్లోకి వెళితే... 'సన్నీ టాక్స్' ఫేమ్, యూట్యూబర్ సతీష్.. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఈ మ్యాచ్ చూసేందుకు వెళ్లాడు. చెన్నై బ్యాటర్ శివమ్ దూబే క్రీజులో ఉన్నప్పుడు, సతీష్ తన చేతిలో ఉన్న నిమ్మకాయను చూపిస్తూ ఏదో మంత్రం చదువుతున్నట్లు నటించాడు. ఆశ్చర్యకరంగా ఆ తర్వాతి బాల్‌కే దూబే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో మ్యాచ్ హైదరాబాద్ వైపు మొగ్గు చూపింది. ఈ దృశ్యాలు రికార్డ్ కావడంతో వీడియో 'ఎక్స్' (ట్విట్టర్)తో పాటు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్‌గా మారింది.

వీడియో వైరల్ కావడంతో సతీష్‌కు ఊహించని పాపులారిటీ వచ్చింది. మీడియా సంస్థలు కూడా అతడిని సంప్రదించాయి. ఈ సందర్భంగా సతీష్ అసలు విషయం వెల్లడించాడు. తాను ఎలాంటి మంత్రం వేయలేదని స్పష్టం చేశాడు. కేవలం ఫన్నీ వీడియో కోసం నాలుగైదు సార్లు ప్రయత్నించగా, చివరిసారికి వికెట్ పడిందని చెప్పాడు. తన రియాక్షన్ కూడా ఒరిజినల్‌గా ఉండటం, దాన్ని నీట్‌గా ఎడిట్ చేసి పోస్ట్ చేయడంతో వైరల్ అయిందని వివరించాడు.



ఏదేమైనా ఈ ఒక్క వీడియోతో సతీష్ ఇప్పుడు 'నిమ్మకాయ మంత్రగాడు'గా సోషల్ మీడియాలో సెన్సేషన్ అయ్యాడు. తాను సరదాకి చేసిన పని ఈ స్థాయిలో పాప్యులర్ అవుతుందని ఊహించలేదని అతను పేర్కొన్నాడు.

## కాష్ పటేల్ అతిగా మద్యం సేవిస్తారంటూ కథనం.. రూ.2300 కోట్లు దావా వేసిన ఎఫ్‌బీఐ డైరెక్టర్



**అఖండ సూర్య :**

అగ్ర రాజ్యం అమెరికాలో ఎఫ్‌బీఐ అనేది ఒక ప్రధానమైన దర్యాప్తు సంస్థ. అమెరికాలో అంతర్గత భద్రత, ఉగ్రవాదం, సైబర్ క్రైమ్, తీవ్రమైన నేరాలపై దర్యాప్తు చేసే అతి ముఖ్యమైన సంస్థ. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక.. ఈ సంస్థ డైరెక్టర్‌గా భారతీయ మూలాలు ఉన్న కాష్ పటేల్‌ను డైరెక్టర్‌గా నియమించారు. కానీ కాష్ పటేల్ మాత్రం నిత్యం వివాదాల్లో చిక్కుకుంటూనే ఉంటారు. ఆ మధ్య ప్రియురాలి సంగీత కచేరీకి జెట్ ఉపయోగించారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా దర్యాప్తులో కూడా నత్తనడక ప్రదర్శిస్తారంటూ విమర్శలు ఉన్నాయి.

తాజాగా మరో వివాదం సంచలనంగా మారింది. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ అతిగా మద్యం సేవిస్తారంటూ "ది అట్లాంటిక్ పత్రిక" తన కథనంలో పేర్కొంది. అతిగా మద్యం సేవించడం కారణంగా ముఖ్యమైన విచారణలకు గైర్హాజరు అవుతారని తన కథనంలో హైలెట్ చేసింది.

దీంతో "ది అట్లాంటిక్ పత్రిక" కథనంపై కాష్ పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ప్రతిష్టతను దెబ్బతీసే విధంగా కథనం ప్రచురించిందని.. అదొక తప్పుడు కథనం అని మండిపడ్డారు. దీంతో పత్రికపై, జర్నలిస్ట్ సారా ఫిట్జ్‌ప్యాట్రిక్‌పై 250 మిలియన్ డాలర్ల(భారత కరెన్సీ ప్రకారం రూ.2300కోట్లు) పరువు నష్టం దావా వేశారు.

**కాష్ పటేల్..**

కాష్ పటేల్ ఫిబ్రవరి 2025 నుంచి ఎఫ్‌బీఐ చీఫ్‌గా ఉన్నారు. గతంలో కూడా మీడియాపై దావాలు వేశారు. ఇది రెండవ పరువు నష్టం కేసు. ఈ కేసు వాషింగ్టన్‌లోని ఫెడరల్ కోర్టులో విచారణకు రానుంది.

## తుపాకీ కాల్పులు.. కత్తులతో దాడి.. రణరంగంగా మారిన జర్మనీ గురుద్వారా

- **జర్మనీలోని ఓ గురుద్వారాలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ**
- **కత్తులు, తుపాకీతో దాడి.. 11 మందికి గాయాలు**
- **ఆధిపత్య పోరు, నిధుల వివాదమే కారణమని పోలీసుల అనుమానం**
- **రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బృందాలు.. ఒకరి అరెస్ట్**
- **ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్**

జర్మనీలోని మోయెర్స్ నగరంలో ఉన్న ఓ గురుద్వారాలో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ ఘటనలో కనీసం 11 మంది గాయపడ్డారు. గురుద్వారాలో ఆధిపత్యం, నిధుల నియంత్రణ వంటి అంశాలే ఈ ఘర్షణకు దారితీసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**అసలేం జరిగిందంటే..!**

ప్రార్థనా మందిరంలో రెండు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి అది కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది. దాదాపు 40 మంది ఈ గొడవలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు కత్తులు, కిర్పాన్ల వంటి పదునైన ఆయుధాలతో దాడి చేసుకున్నారు. కొందరు పెప్పర్ స్ప్రే కూడా ఉపయోగించారు. ఘర్షణకు సంబంధించిన భయానక దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ప్రత్యేక వ్యూహాత్మక విభాగాలు సహా భారీ ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

కొత్త డైరెక్టర్ల బోర్డు ఎన్నిక, గురుద్వారా నిధులపై నియంత్రణ వంటి విషయాల్లో మాజీ, ప్రస్తుత బోర్డు సభ్యుల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయని, అవే ఈ దాడికి కారణమై ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. "ఇది పక్కా ప్రణాళికతో జరిగిన దాడి. ప్రార్థనలు మొదలవడానికి ముందే దాడి చేసిన వారు పెప్పర్ స్ప్రే చల్లారు. వారిలో ఒకరు తుపాకీతో కాల్పులు జరపగా, మరికొందరు కత్తులతో దాడి చేశారు" అని ఓ వ్యక్తి వివరించారు.

గాయపడిన వారికి అక్కడికక్కడే వైద్య సిబ్బంది చికిత్స అందించారు. ఎవరి ప్రాణానికీ ప్రమాదం లేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఒక అనుమానితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన తూటా కేసింగ్‌ల ఆధారంగా అది బ్లాంక్‌ఫైరింగ్ పిస్టల్ అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. తుపాకీని ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఈ ఘటనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ విభాగం దర్యాప్తు చేస్తోంది.

## H1B వివాదానికి గట్టి సమాధానం.. టెక్సాస్ సిటీ కౌన్సిల్‌లో భారత సంతతి యువతి సంచలన ప్రసంగం



**అఖండ సూర్య :**

అమెరికాలో హెచ్1బీ (H1B) వీసాలు, భారతీయ నిపుణుల ప్రాబల్యంపై అప్పుడప్పుడూ వ్యక్తమయ్యే వ్యతిరేకతకు ఓ భారత సంతతి యువతి దీటుగా బదులిచ్చారు. స్థానికుల భయాలను పోగొడుతూ, భారతీయ విలువల ఔన్నత్యాన్ని చాటుతూ టెక్సాస్‌లోని ఫ్రిస్కో సిటీ కౌన్సిల్ సమావేశంలో నేహా సూరత్రన్ (Neha Suratran) అనే యువతి చేసిన ప్రసంగం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భారతీయ నిపుణుల వల్ల స్థానిక వర్గాలకు ముప్పు ఉందంటూ వస్తున్న విమర్శలను నేహా గణాంకాలతో సహా తిప్పికొట్టారు. 'గణాంకాలను బట్టి చూస్తే.. భారతీయ సమాజం ఉన్నత విద్య, అధిక ఆదాయం, అతి తక్కువ నేరాల రేటుతో ముడిపడి ఉంది. సురక్షితమైన పరిసరాలు, మెరుగైన పాఠశాలలు, ఉన్నత ఆర్థిక పురోగతికి కారణమయ్యే ఒక వర్గాన్ని చూసి ఎందుకు భయపడాలి?' అని ఆమె కౌన్సిల్ వేదికగా ప్రశ్నించారు. మీ పిల్లలు సురక్షితమైన వాతావరణంలో, అత్యుత్తమ పనితీరు కనబరిచే పాఠశాలల్లో, స్థిరమైన సమాజంలో పెరగాలని కోరుకుంటే.. భారతీయులను చూసి భయపడటం కాదు, వారిని సాదరంగా స్వాగతించాలి అని ఆమె స్పష్టం చేశారు.

**బలవంతపు మతమార్పిడులకు తావులేదు..**

అమెరికాలో సాంస్కృతిక అస్తిత్వం, మతం గురించి వస్తున్న అపోహలను కూడా నేహా గట్టిగా ఖండించారు. 'నేను ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. మేము ఎవరి మతాన్నీ మార్చడానికి ప్రయత్నించము. హిందూ మతం బలవంతపు మతమార్పిడులను అస్సలు ప్రోత్సహించదు. మంచి వ్యక్తిగా జీవిస్తే చాలు.. ఎవరైనా స్వర్గానికి వెళ్తారు. ఇక మా సంప్రదాయాలతో పాటు స్థానిక పండుగలైన థాంక్స్ గివింగ్, క్రిస్మస్ వంటి వాటిని కూడా మేము ఎంతో సంతోషంగా కలిసిమెలిసి జరుపుకుంటాం' అని ఆమె పేర్కొన్నారు.

**ప్రశంసల జల్లు కురిపిస్తున్న నెటిజన్లు**

ఈ ప్రసంగానికి సంబంధించిన వీడియోను శశాంక్ మట్టూ అనే నెటిజన్ 'ఎక్స్' (ట్విట్టర్)లో పంచుకోగా, అది క్షణాల్లో వైరల్‌గా మారింది. పరస్పర గౌరవం, సహజీవనం అనే భారతీయ విలువలను అంతర్జాతీయ వేదికపై అత్యద్భుతంగా చాటిచెప్పారని నెటిజన్లు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. పరస్పర గౌరవం అనేది ఏ సమాజానికైనా పునాది. సహజీవనం అనే భారతీయ విలువను ప్రపంచ వేదికపై గర్వంగా ప్రదర్శించారు' అని ఒక యూజర్ కామెంట్ చేశారు. 'హిందువులకు, ఇతర మతాలకు ఉన్న ప్రధాన వ్యత్యాసం ఇదే. వారు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తమ అత్యుత్తమ సేవలను అందించి ఆ దేశ శ్రేయస్సుకు, అభివృద్ధికి తోడ్పడతారు' అని మరొకరు ప్రశంసించారు.

# ఇరాన్‌తో ఒప్పందం కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్!

- **ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు**
- **ఒప్పందం కుదిరితే చర్చలకు హాజరుకానున్న ట్రంప్**
- **చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ సానుకూల సమీక్ష**
- **రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగింపు దశలో చర్చలు**
- **అణు కార్యక్రమం, ఆంక్షలపై ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు**

**అఖండ సూర్య :**

అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ వారం ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఒకవేళ ఒప్పందం కుదిరితే, దానిపై సంతకం చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా లేదా వర్చువల్‌గా హాజరయ్యే అవకాశం ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ గడువును పొడిగించే అవకాశం చాలా తక్కువని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు.

**ఇరాన్ హాజరుపై సందిగ్ధత**

అయితే, ఈ చర్చల్లో ఇరాన్ పాల్గొంటుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల హార్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు చెందిన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంతో చర్చలకు హాజరుకాబోమని టెహ్రాన్ మొదట ప్రకటించింది. కానీ, తాజాగా తమ వైఖరిని సానుకూలంగా సమీక్షిస్తున్నామని, అయితే తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపినట్లు రాయిటర్స్ పేర్కొంది. చర్చలు జరుగుతాయనే విశ్వాసాన్ని అమెరికా వ్యక్తం చేస్తోంది. ఈ కీలక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్లు అమెరికా వర్గాలను ఉటంకిస్తూ ఏక్సియోస్ నివేదించింది.

**ఇరు దేశాల డిమాండ్లు, హెచ్చరికలు**

ఈ చర్చలు విజయవంతం కావడానికి ఇరు దేశాల డిమాండ్లు పెద్ద అడ్డంకిగా మారాయి. చమురు ధరలు, స్టాక్ మార్కెట్లు కుప్పకూలకుండా చూసే ఒప్పందం కోసం ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇరాన్‌కు అణ్వాయుధాలు అభివృద్ధి చేసే సామర్థ్యం ఉండకూడదని ఆయన గట్టిగా పట్టుబడుతున్నారు. మరోవైపు, యుద్ధాన్ని నివారించి, తమపై ఉన్న ఆంక్షలను



సడలించే ఒప్పందం కోసం ఇరాన్ ఎదురు చూస్తోంది. కానీ, తమ అణు కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేస్తోంది. చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరు దేశాలు హెచ్చరించుకుంటున్నాయి. తమ షరతులను తిరస్కరిస్తే ఇరాన్‌లోని ప్రతి వంతెనను, పవర్ ప్లాంట్‌ను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా, అమెరికా తమ పౌర మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే, గల్ఫ్ దేశాల్లోని పవర్ స్టేషన్లు, డీశాలినేషన్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ప్రతిస్పందించింది.

**ఇస్లామాబాద్‌లో భారీ ఏర్పాట్లు**

మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఈ కీలక చర్చలకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్ వ్యాప్తంగా దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి.

## ఉద్యోగుల జీతాల చెల్లింపుపై కొత్త విధానం.. ఇక నుంచి శాలరీ..!

- **జీతాల చెల్లింపుపై నేపాల్ సర్కార్ కీలక నిర్ణయం**
- **ప్రభుత్వోద్యోగుల జీతాల చెల్లింపుపై కొత్త విధానం**
- **ప్రభుత్వ నిర్ణయానికి ఆర్థిక శాఖ ఆమోదం**



**అఖండ సూర్య :**

ఉద్యోగులకు జీతాలు ఎప్పుడిస్తారు? నెల రోజులు పని చేశాక ఇస్తారు? ఈ విషయం అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు నేపాల్‌లో పద్ధతులు మారిపోయాయి. శాలరీ విధానాన్ని ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. ఇకపై నెలవారీ ప్రకారం కాకుండా ప్రతి 15 రోజులకోసారి రెండు దఫాలుగా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయానికి ఆర్థిక శాఖ కూడా పచ్చజెండా ఊపేసింది.ఖర్చులను ఉత్తేజపరిచి.. దాని ద్వారా ఆర్థిక కార్యకలాపాలు పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించే విధానాన్ని మార్చినట్లుగా తెలిపింది. ఇకపై 15 రోజులకు ఒకసారి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపింది.

ఆర్థిక వ్యవస్థను బలపరచడమే ముఖ్య ఉద్దేశమని అధికారులు కూడా చెబుతున్నారు. ఉద్యోగులకు సకాలంలో నగదు అందితే నెల ప్రారంభంలోనే గరిష్ట స్థాయికి చేరి.. ఆపై తగ్గిపోకుండా నెల మొత్తం స్థిరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోందన్నారు. నెలాఖరులో ఖర్చుల విషయంలో తరచుగా ఇబ్బంది పడే మధ్యతరగతి ఉద్యోగులపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి ఇది సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగులు కూడా స్వాగతించారు. పాఠశాల ఫీజులు, యుటిలిటీ బిల్లులు, రోజువారీ గృహ ఖర్చులను ఈ విధానం ద్వారా సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ప్రతి రెండు వారాలకు క్రమం తప్పకుండా నిధులు అందడం వల్ల స్వల్పకాలిక రుణాలపై ఆధారపడటం కూడా తగ్గుతుందని అంటున్నారు.

ఈ మార్పు చిన్న వ్యాపారాలకు, చిల్లర వ్యాపారులకు కూడా ప్రయోజనం చేకూర్చగలదని ఆర్థికవేత్తలు అంటున్నారు. నెల ప్రారంభంలో ఖర్చులో ఆకస్మిక పెరుగుదల.. ఆ తర్వాత మందగమనం ఉండటానికి బదులుగా సమతుల్యంగా ఉండవచ్చు అని భావిస్తున్నారు. ఈ నమూనా అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఇప్పటికే అమలవుతోంది. ఇది విజయవంతమైతే ఇతర ఆర్థిక వ్యవస్థలకు ఇది ఒక నమూనాగా ఉపయోగపడగలదని నిపుణులు భావిస్తున్నారు.

## హార్మూజ్ జలసంధి దాటిస్తామంటూ అధికారుల రూపంలో ఘరానా మోసం

- **హార్మూజ్ జలసంధికి ఇరువైపులా నిలిచిపోయిన ఇంధన నౌకలు**
- **క్రిప్టోకరెన్సీ చెల్లిస్తే బదులుగా నౌకలను హార్మూజ్ దాటిస్తామంటున్న దోపిడీదారులు**
- **ఇరాన్ అధికారులమంటూ నమ్మబలుకుతున్న దోపిడీదారులు**

**అఖండ సూర్య :**

నేటి కాలంలో మనం ఎన్నో రకాల మోసాలను చూస్తున్నాం. ఆర్థిక మోసాలు మొదలు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల వరకు చిత్రవిచిత్రమైన మోసాలు జరుగుతున్నాయి. అమెరికా, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో, వినడానికి విచిత్రంగా ఉన్న మరో మోసం వెలుగు చూసింది. హార్మూజ్ జలసంధికి ఇరువైపులా పెద్ద సంఖ్యలో నౌకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఒకవైపు ఇరాన్ హార్మూజ్‌ను మూసివేయగా, మరోవైపు అమెరికా దిగ్బంధిస్తోంది.

ఈ క్రమంలో కొందరు దోపిడీదారులు అధికారుల వేషంలో అక్కడ నిలిచిపోయిన నౌకల వద్ద డబ్బు వసూలు చేస్తున్నారు. క్రిప్టో కరెన్సీ చెల్లిస్తే దానికి బదులుగా నౌకలను హార్మూజ్ జలసంధి దాటిస్తామని నమ్మబలుకుతున్నారు. దోపిడీదారుల తీరును గుర్తించిన గ్రీక్ మ్యారిటైమ్ రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ 'మారిస్క్స్' నౌకల యజమానులకు హెచ్చరికలు జారీ చేసింది.

తాము ఇరాన్ అధికారులమని, ఓడను హార్మూజ్ దాటిస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని సూచించింది. క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్స్, టెథర్ రూపంలో చెల్లింపులు జరిపితే మీ నౌకలను హార్మూజ్ జలసంధి దాటిస్తామని ఈ దోపిడీదారులు నమ్మిస్తున్నారని, అలా అధికారుల వేషంలో వస్తే నమ్మవద్దని సూచించింది. ఇరాన్ అధికారులు ఇలాంటి అవకాశాలు కల్పించలేదని స్పష్టం చేసింది. ఇది కచ్చితంగా మోసగాళ్ళ పనే అని పేర్కొంది.



## ఇండియన్స్ టార్గెట్‌గా కెనడా కొత్త రూల్స్? ఇక అంతే సంగతులు!

**అఖండ సూర్య :**

కెనడా ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో పెను మార్పులు వచ్చాయి. అక్కడి ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'బిల్ సి12' (Bill C12) చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం వల్ల కెనడాలో స్థిరపడాలని చూస్తున్న వారికి, ముఖ్యంగా రిఫ్యూజీ (శరణార్థి) హోదా కోరుకునే భారతీయులకు భారీ షాక్ తగిలింది. ఈ కొత్త చట్టం వివరాలు, ఇండియన్స్‌పై దాని ప్రభావం ఎంత మేరకు ఉంటుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**బిల్ సి-12 ముఖ్యమైన నిబంధనలు ఇవే..**

కొత్త నిబంధన ప్రకారం.. కెనడాలోకి ప్రవేశించిన ఒక ఏడాది లోపు మాత్రమే రిఫ్యూజీ హోదా కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ గడువు దాటితే దరఖాస్తును స్వీకరించరు. ఇదివరకైతే చాలా ఏళ్లు గడిచాక, పీఆర్ (PR) రాకపోతే చివరి ఆప్షన్‌గా భారతీయులు రిఫ్యూజీ క్లెయిమ్ చేసేవారు. ఇకపై అది సాధ్యం కాదు. ఈ చట్టం కేవలం కొత్తవారికి మాత్రమే కాదు, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 19,000 దరఖాస్తులపై కూడా ప్రభావం చూపనుంది. దీనివల్ల వేల సంఖ్యలో భారతీయ దరఖాస్తుదారులు ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంది.

కెనడా ప్రభుత్వం ఇప్పుడు ఏ ఒక్క వ్యక్తినో కాకుండా, ఒకేసారి పెద్ద సంఖ్యలో వీసాలను లేదా ఇమ్మిగ్రేషన్ పత్రాలను రద్దు చేసే అధికారాన్ని పొందింది. దీని కోసం ప్రతి కేసును విడివిడిగా విచారించాల్సిన అవసరం లేదు. "జాతీయ ప్రయోజనాల" దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది. శరణార్థుల దరఖాస్తుల విచారణను వేగవంతం చేయడం, ఇతర దేశాలతో సమాచారాన్ని పంచుకోవడం ఈ చట్టంతో సులభతరం అవుతుంది. అయితే మానవ హక్కుల సంఘాలు, ఇమ్మిగ్రేషన్ లాయర్లు ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు దీనిని శరణార్థుల హక్కుల ఉల్లంఘనగా పేర్కొంటున్నాయి. సరైన విచారణ లేకుండానే వీసాలు రద్దు చేయడం వల్ల విదేశీయులను బలవంతంగా వెనక్కి పంపే ముప్పు పెరుగుతుందని వాళ్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే సమయంలో కెనడా ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంటోంది. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడానికి



ఇది అవసరమని ప్రభుత్వం చెబుతోంది. మోసపూరిత దరఖాస్తులను అడ్డుకోవడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి PRRA (PreRemoval Risk Assessment) అనే అవకాశం ఉంటుందని, ఆ వ్యక్తిని సొంత దేశానికి పంపడం సురక్షితమేనా అని అంచనా వేస్తామని వెల్లడించింది.

**భారతీయులపై ప్రభావం ఎంతంటే..**

కెనడాలో భారతీయ విద్యార్థులు, వర్క్ పర్మిట్ హోల్డర్లు లక్షల్లో ఉన్నారు. పీఆర్ దక్కని వారు చాలామంది రిఫ్యూజీ దరఖాస్తుల మీద ఆధారపడుతుంటారు. కొత్త చట్టం వల్ల పాత కేసులు రీఓపెన్ అవ్వడం లేదా వేగంగా తిరస్కరణకు గురవ్వడం జరిగితే.. భారతీయులు పెద్ద సంఖ్యలో డిపోర్టేషన్ (దేశం నుంచి బహిష్కరణ) ఎదుర్కోవాల్సి రావచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కెనడా వెళ్లాలనుకునే వారు లేదా అక్కడ ఉన్న వారు ఇకపై ఇమ్మిగ్రేషన్ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




# ఎన్టీఆర్ - నీల్ రిలీజ్ డేట్ ఫిక్స్..

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా సినిమా పై అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలున్నాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ మొదలై చాలా కాలం అవుతోంది. కానీ ఇంకా సగానికి పైగా షూటింగ్ బ్యాలెన్స్ ఉన్నట్టుగా తెలుస్తోంది. మరి ఇంత స్లోగా నడుస్తున్న ఈ సినిమా.. ఇదే ఏడాదిలో రిలీజ్ అవుతుందా? అంటే, లేదనే మాట వినిపిస్తోంది. మొదట 2026 జూన్‌లో విడుదల అవుతుందని మేకర్స్ ప్రకటించారు. ప్రశాంత్ నీల్ భారీ స్థాయిలో చిత్రీకరించే యాక్షన్ సన్నివేశాలకు తోడు.. క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదట.
అందుకే.. డ్రాగన్ డిలే అవుతు వస్తోంది. గతంలో 2026 జూన్ 25న సినిమా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించినా ఫ్యాన్స్ కు షాక్ ఇస్తూ ఇప్పుడు 2027కి వెళ్లిపోయింది. తాజాగా ఈ సినిమా ను 2027జూన్ 11 రిలీజ్ చేస్తున్నారు అఫీషియల్ గా ప్రకటిచారు. అలాగే మే 20న ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ ను టిలీజ్ చేస్తున్నారు. అందుకోసం ఇప్పటికే వపర్ ఫుల్ గ్లింప్స్ కట్ చేసి ఉంచారు. ఈ విషయాన్ని కూడా అఫీషియల్ గా ప్రకటించారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ సరికొత్తగా మేకోవర్ అవుతున్నాడు. భారీగా వెయిట్ లాస్ అయి, కండలు తిరిగిన దేహంతో కనిపిస్తున్నాడు. దీంతో.. డ్రాగన్ ఫస్ట్ లుక్ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు టైగర్ ఫ్యాన్స్. పక్కా ప్రశాంత్ నీల్ మార్క్ పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో.. కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# జోష్‌లో 'జైలర్ 2' టీమ్.. షూటింగ్ పూర్తి




మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. దీనికి కొనసాగింపుగా 'జైలర్ 2' వస్తోన్న సంగతి తెలిసిందే. అగ్రహీరో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు తెలుపుతూ టీమ్ కొన్ని ఫొటోలు పంచుకుంది. భారీ స్థాయిలో ఇది రానున్నట్లు తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. త్వరలోనే విడుదల తేదీని కూడా టీమ్ వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.
విడుదలకు సిద్ధమవుతోన్న వేళ ఇటీవల ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు లీక్ కావడం చిత్ర యూనిట్‌ను ఆవేదనకు గురిచేసింది. 'జైలర్2' సెట్లో తీసిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో లీకయ్యాయి. ఈ వీడియోను షేర్, ప్రచారం చేసిన ఖాతాలకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు బయటకు వచ్చిన సన్నివేశాల వీడియోను ఆ ఖాతాల నుంచి తొలగించడానికి అవసరమైన చర్యలను చేపట్టినట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.

# 'జన నాయగన్' సాఫీగా విడుదలై ఉంటే ఆశ్చర్యం



తన కుమారుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నటించిన 'జన నాయగన్' కాంట్రవర్సీపై ఎస్.ఎ. చంద్రశేఖర్ స్పందించారు. ఈ సినిమా సెన్సార్ సర్టిఫికెట్ జాప్యం, లీక్‌పై తామేమీ ఆందోళన పడలేదని, ఈ సమస్యలు తాము ఊహించినవే అని అన్నారు. ఒకవేళ మూవీ సాఫీగా విడుదలై ఉంటే ఆశ్చర్యపోయేవాళ్లం పేర్కొన్నారు.
''నేను రాజకీయాల్లోకి వెళుతున్నప్పుడు మీరు నాతో సినిమా చేయాలనుకుంటున్నారు. కాబట్టి ఈ చిత్రం విషయంలో ఎదురయ్యే అడ్డంకులపై మీకు అవగాహన ఉందని అనుకుంటున్నా. దీనికి ఓకేనా?' సినిమాని ఖరారు చేయబోయే ముందు నిర్మాతను విజయ్ అడిగాడు. ఇబ్బందులు తలెత్తుతాయని విజయ్‌కు తెలుసు. రాజకీయ ప్రత్యర్థి కావడంతో విజయ్ మూవీని లీక్ చేశారు'' అని ఆరోపించారు. కుటుంబమా? ప్రజలా? అంటే విజయ్ ఓటు ప్రజలకే అని అన్నారు.
విజయ్ హీరోగా దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం జనవరిలోనే విడుదల కావాల్సి ఉంది. సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో వాయిదా పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఆన్‌లైన్‌లో కొన్ని సన్నివేశాలు లీక్ కాగా.. కోయంబత్తూరులోని ఓ లోకల్ ఛానల్‌లో మూవీ ప్రసారం కావడం కోలీవుడ్‌ను కలవర పెట్టింది. ఈ కేసుల్లో ప్రధాన నిందితులు అరెస్టు అయిన సంగతి తెలిసిందే.



# ఇమ్రాన్‌తో కెమిస్ట్రీ అదిరిపోవాల్సిందే!

బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దిశా పటానీ ఇప్పుడు ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ఇమ్రాన్ హష్మీ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ఆవారాపన్ 2'లో దిశా హీరోయిన్‌గా నటిస్తోంది. 'ఆవారాపన్ 2' చిత్రంలో దిశా పటానీ భాగం కావడంతో సినిమా స్థాయి మరింత పెరిగిందని చిత్ర బృందం భావిస్తోంది. నిర్మాత విశేష్ భట్ మాట్లాడుతూ.. "దిశా పటానీ ఈ ప్రాజెక్ట్‌లో చేరడం వల్ల 'ఆవారాపన్' ప్రపంచం సరికొత్త అవకాశాలకు వేదికైంది'' అని ప్రశంసించారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఇమ్రాన్ హష్మీ సరసన అత్యంత పవర్‌ఫుల్, ఎమోషనల్ పాత్రలో దిశా మెరిసిపోనుంది. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ, దిశా యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం.
ఇమ్రాన్ హష్మీ సినిమాలంటేనే పాటలు ఒక రేంజ్‌లో ఉంటాయి. ఈ సీక్వెల్‌లో కూడా దిశా పటానీపై చిత్రీకరించే పాటలు మళ్ళీ పాత 'ఆవారాపన్' మ్యాజిక్‌ను తీసుకువస్తాయని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకత్వంలో రాబోతుంది. విశేష్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో విడుదలవుతున్న ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఎదురు కానుంది. సన్నీ డియోల్ నటించిన 'లాహోర్ 1947' ఆగస్టు 13న విడుదల కాబోతుండగా, మరుసటి రోజే దిశా తన 'ఆవారాపన్ 2'తో థియేటర్లలోకి రానుంది. ఒకవైపు సన్నీ డియోల్ మాస్ పవర్, మరోవైపు దిశా పటానీ గ్లామర్ అండ్ యాక్షన్.. ఈ పోటీ బాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది.




# నేను ఎప్పుడూ ఏ భాషనూ చిన్నచూపు చూడను

సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవి, తన అద్భుతమైన నటనతో తెలుగు, తమిళ, మలయాళ ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం 'రామాయణ'లో సీతగా నటిస్తూ బాలీవుడ్‌లోనూ అడుగుపెడుతున్న ఈమె, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన గురించి జరిగిన ఒక తప్పుడు ప్రచారంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో ఒక ప్రెస్ మీట్‌లో తాను చెప్పిన మాటలను మీడియా వక్రీకరించడం తనను ఎంతగానో బాధించిందని ఆమె పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం జరిగిన ఒక ప్రెస్ మీట్‌లో, "మలయాళ నటీనటులు తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడగలరు?" అని ఒక రిపోర్టర్ అడిగారు. దానికి సాయిపల్లవి చాలా నిజాయితీగా, "నేను మలయాళీని కాను, తమిళ అమ్మాయిని" అని మాత్రమే చెప్పారట. అయితే, రెండేళ్ల తర్వాత ఒక పత్రికలో "తనను మలయాళీ అని పిలిచినందుకు సాయిపల్లవికి కోపం వచ్చింది" అని హెడ్‌లైన్ వేయడం ఆమెను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపింది. దీని వల్ల ఆమె మలయాళ భాషను ద్వేషిస్తుందనే ఒక తప్పుడు ముద్ర పడిందని అది తనను చాలా భాద పెట్టిందని అన్నారు.
ఈ విషయాన్ని వివరిస్తూ సాయి పల్లవి ఒక చేదు అనుభవాన్ని పంచుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ఒక మహిళ ఆమెతో మలయాళంలో మాట్లాడటానికి సంకోచిస్తూ, "మీకు కోపం వస్తుందేమో" అని అడగడం ఆమెను కలచివేసింది. "నేను ఎప్పుడూ ఏ భాషను చిన్నచూపు చూడలేదు. నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. అది నా పుట్టుక గురించి ఇచ్చిన క్లారిటీ మాత్రమే కానీ, ఏ భాష మీదో నాకు ద్వేషం లేదు. నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు" అని సాయిపల్లవి స్పష్టం చేశారు. కోయంబత్తూరులో పెరిగిన తాను అన్ని భాషలను గౌరవిస్తానని, తన మాటలను వక్రీకరించడం వల్ల సాధారణ ప్రజల్లో తన పట్ల తప్పుడు అభిప్రాయం ఏర్పడటం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సెలబ్రిటీల గురించి వచ్చే వార్తల్లో వాస్తవం ఎంత ఉందో తెలుసుకోకుండా ప్రచారం చేయడం వల్ల వారి వ్యక్తిగత ఇమేజ్ ఎలా దెబ్బతింటుందో చెప్పడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం అని చెప్పుకొచ్చింది.

# సిద్ధూ జొన్నలగడ్డకు జోడీగా మీనాక్షి చౌదరి?

టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ, స్టార్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందుతున్న భారీ వెబ్ సిరీస్‌లో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా ఎంపికవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. వరుస బ్లాక్ బస్టర్ హిట్లతో దూసుకుపోతున్న ఈ అందాల తార, ఇప్పుడు డిజిటల్ ప్రపంచంలోకి కూడా తనదైన శైలిలో అడుగుపెట్టబోతోంది. గత కొద్ది కాలంగా మీనాక్షి చౌదరి తెలుగులో తిరుగులేని ఫామ్‌లో ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో అమ్మడు రేంజ్ మారిపోయింది. కేవలం కమర్షియల్ సినిమాలే కాకుండా, నటనకు అవకాశం ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటూ ప్రేక్షకులకు దగ్గరవుతోంది. అందుకే, ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక వెబ్ సిరీస్‌లో మీనాక్షిని తీసుకోవడం పట్ల మేకర్స్ చాలా ఎగ్జైట్‌గా ఉన్నారు. సిద్ధూ బాడీ లాంగ్వేజ్‌కు, మీనాక్షి గ్లామర్ అండ్ యాక్టింగ్ తోడైతే ఈ సిరీస్ మరో స్థాయికి వెళ్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ స్క్రీన్‌పై చాలా ఫ్రెష్‌గా ఉంటుందని టాక్. ఈ వెబ్ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. గ్లోబల్ ఆడియన్స్‌ను దృష్టిలో ఉంచుకుని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే తన నటనతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన మీనాక్షి చౌదరి, ఈ వెబ్ సిరీస్‌తో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవడం ఖాయం. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మొత్తానికి, స్టార్ బాయ్ సిద్ధూతో మీనాక్షి చౌదరి ఆన్‌స్క్రీన్ రొమాన్స్ చూడటానికి ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు.



# 'ప్యారడైజ్' కోసం రెండేళ్లు అంకితం.. కాయదు లోహర్ రిస్క్ సక్సెస్ అవుతుందా?

తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో "బాహుబలి" వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న "ప్యారడైజ్" సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి.
ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ "ప్యారడైజ్" ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది.
నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో "సైజ్ జీరో" కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. "ప్యారడైజ్" విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.



This Newspaper is Published by Petta Venkata Suryanarayana from Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-ii, Gandhi Nagar, Medchal Malkajgiri,Telangana - 500037 on behalf of Petta Venkata Suryanarayana, edited by Petta Venkata Suryanarayana and printed by Petta Venkata Suryanarayana at Sree Sesha Sai Enterprises ,Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-II, Gandhi Nagar, Medchal Malkajgiri, Telangana - 500037, e-mail: seshasai09@gmail.com, Phone: 9618880945